# దైవానికి చేసే షోడశోపచారపూజలోని అంతరార్థం ఏమిటి?

ఆచార్య భరద్వాజ

నిత్యము భక్తిశ్రద్ధలతో ఆలయ సందర్శనం చేస్తూ యింటివద్ద నిత్యానుష్టానము, పూజ, పారాయణ మొదలగునవి చేసుకొంటుంటే క్రమంగా మన లౌకికమైన విధులన్నింటినీ నిమిత్తమాత్రంగాను, భగవంతుడు మనకప్పగించిన బాధ్యతలన్న దైవీభావంతోనూ చేయగల్గుతాము. అనివార్యమని భగవద్గీతాదులు చెప్పిన కష్టసుఖాదులను సమభావంతో, ఓర్పుతో ఎదుర్కొనడం అలవడుతుంది. క్రమంగా మన దేహము, మనస్సు, వాక్కు భగవత్సేవకంకితమైన పనిముట్లుగా, పాత్రలుగా భక్తుడు తలుస్తాడు. బాహ్యంగా శరీరమెలా మందిరాన్ని నిత్యమూ దర్శిస్తుందో అలానే అంతఃకరణ మన దేహాన్ని దేవాలయంగా భావించి పవిత్రంగా ఉంచుకోవడం నేర్చుకొంటుంది. అలా నడుచుకోగల్గితేనే మనం దేవాలయాన్ని దర్శించినట్లు. ఆలయంలోని, యింటిలోని పూజాపాత్రలను స్వంతవిగా భావించి లౌకిక అవసరాలకెలా వాడుకోలేమో అలానే మన త్రికరణాలను– అంటే దేహం , మనస్సు, వాక్కులను –అయోగ్యమైన రీతిన– అంటే దైవీభావంతో మేళవంగాని విధంగా–వాడుకోలేము. అది మన భక్తి వాస్తవమనడానికి, మనం సాధన వాస్తవంగా చేస్తున్నామనడానికీ గుర్తు. ఇలా పరిశుద్ధమొనర్చబడిన త్రికరణాల రూపమైన సుక్షేత్రంలోనే భగవన్నామస్మరణ, ధ్యానము, పూజ అనబడు ఉత్తమ బీజాలు మొలకెత్తి వృద్ధి పొందుతాయి.

ఈ భావాన్ని మన మనస్సుల మీద నిత్యమూ బలంగా ముద్రించుకోడానికనువుగా మన పెద్దలు కొన్ని ఆచారాలను మనకు అందించారు. వాటి అంతరార్థం దేహాన్ని దేవాలయంగా, అవయవాలను, త్రికరణాలను పవిత్రమైన పూజాసామాగ్రిగా రూపొందించుకొనమని, అయోగ్యమైన రీతిన వాటిని వినియోగించి అపవిత్రం చేసుకోవద్దనీ వాటి సందేశం. దీనిని కొంచెం వివరిస్తాను–

ఇంట్లో పూజగదిలోకి గాని, దేవాలయానికి గాని ప్రీతితో యీ దేహాన్ని, దానితోపాటు భక్తియుక్తమైన మనస్సును ఎలా ప్రవేశ పెడతామో అలానే పూజలో యిష్టదైవాన్ని ఆహ్వానము ('ఆవాహన')చేస్తాము. దైవం సర్వగతుడు గదా! ఆయన వేరే ఎక్కడో వుంటేగదా మనం ఆవాహన చేయగలిగేది! సర్వగతుడైన ఆయన ప్రత్యక్ష సాన్నిధ్యంలో వున్నామన్న గుర్తును బలంగా హృదయములో ప్రతిష్ఠించుకొనడమే ఆవాహన, ఆసన సమర్పణ. అలానే మన శరీరం గూడ యిష్టమూర్తి ఎదుట కూర్చుంటుంది. పూజారంభంలో మనం ఆచమనం చేసి, అలానే తర్వాత దైవానికి ఆచమనీయం సమర్పిస్తాము. దైవానికి సమర్పించిన పాద్యం(పాదాలు నీటితో కడగడం) వలెనే మనం కూడ మొదట యింట్లోకి రాగానే కాళ్ళు కడుక్కొంటాము–అక్కడక్కడ లౌకిక కార్యాలకోసం సంచరించి రజో గుణాత్మకమైన భావాలతో (రజస్సు అంటే ధూళి అని గూడ అర్థం– దేహానికన్వయించుకుంటే) మలినమైన మనస్సును భక్తి భావంతో క్షాళనం చేసుకొన్నట్లే! ఇష్టదైవానికి ఆత్మసమర్పణ చేసినట్లే మన జీవితము, సాధనలను మన హృదయస్థమైన ఆత్మకొరకే అర్పణచేస్తాము. భక్తుడు స్నాన, తిలక , గంధధారణాదులన్నీ తన దేహాన్ని దైవభావంతో చూడడమేనని గుర్తించాలి. కేవలం అలంకరణ ప్రాయంగాదు.

అలానే పారాయణ, స్తోత్రపాఠాలతో పవిత్రమైనవాక్కును వ్యర్థము, తుచ్ఛము అయిన సంభాషణలతో ఎలా అపవిత్రం చేయడం? ధ్యానంతో, భగవల్లీలాచింతనతో పవిత్రం చేసుకొన్న మనస్సును రాగ, ద్వేష, అసూయాది భావాలతో ఎలా భ్రష్టం చేసుకోగలం? ఇట్టి భావన నిర్మిస్తేనే పూజలో మనంచేసే ఆత్మసమర్పణ వాస్తవము, సార్థకమూ అవుతుంది. దానిని సుప్రతిష్ఠితం చేసుకోవడానికే యిలాటి బాహ్యాచారాలను పెద్దలు ఏర్పరిచారు. ఇలా నిలుపుకొంటేనే మనం చేసే ఆలయ దర్శనంగాని, యింటిలోని పూజామందిరంలోని నిత్యపూజగానీ నిజంగా పవిత్రము, శక్తివంతమూ కాజాలదు.

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 27 ఫిబ్రవరి 2010 సంచిక: 10

OFFICIAL ORGAN OF MASTER UNIVERSAL SAI TRUST

ఛీఫ్ ఎడిటర్: శ్రీ పోలూరి శ్రీనివాసరావు బి.ఎ.ఎల్.ఎల్.బి

ఎగ్జిక్యూటివ్ ఎడిటర్: శ్రీ జె.శ్రీనివాసరావు, ఎమ్.ఎస్.సి


<u>చందా వివరములు</u>

| | | |
|---|---|---|
| విడిప్రతి | : | రూ. 10-00 |
| సంవత్సర చందా | : | రూ. 100-00 |
| జీవిత చందా | : | రూ. 1,116-00 |

(సం॥లోపల 5 తేలిక వాయిదాలలో చెల్లించవచ్చును)

(20 సం॥లపాటు మీకు పత్రిక పంపబడుతుంది)

| | | |
|---|---|---|
| రాజపోషకులు | : | రూ. 3,000-00 |
| మహారాజపోషకులు | : | రూ. 5,000-00 |


<u>చిరునామా</u>

**శ్రీ మాస్టర్ యూనివర్సల్ సాయి ట్రస్ట్, మంగమూరు డొంక, ఒంగోలు-2.**

**ఫోన్ నెం: 08592 - 233271**

website: www.saibharadwaja.org


www.saimasterforums.org

# విషయసూచిక:


| | | |
|---|---|---|
| 1. | దైవానకి చేసే షోడశోపచారపూజలోని అంతరార్థం ఏమిటి? | 01 |
| 2. | నిత్యజీవితంలో ధర్మాధర్మాలను నిర్ణయించడం ఎలా? | 03 |
| 3. | సద్గుర్వనుగ్రహము | 05 |
| 4. | వార్తాలాపము - సీరియల్ | 08 |
| 5. | శ్రీ భరద్వాజ లేఖామృతము | 10 |
| 6. | పరమహంస | 12 |
| 7. | శ్రీ దత్తలీలామృతము | 17 |
| 8. | శ్రీ సాయి సచ్చరిత్ర | 20 |
| 9. | పరమార్థంతప్ప కోరుకోదగినది ఏదీలేదు! | 22 |
| 10. | అడవితల్లి చల్లని ఒడిలో ఆధ్యాత్మిక సౌరభం | 24 |
| 11. | సైన్సు చెప్పే వేదాంతం! | 26 |
| 12. | ప్రక్షిప్తాలు-ప్రభావాలు | 27 |
| 13. | అనుమానాలకు తావిచ్చే ఆచార్యుని ఆదేశం! | 30 |
| 14. | ద్వారకామాయి అనుభవమంటపం | 31 |


పత్రిక ప్రచారణకు ఆర్థికంగా సహకరించగోరిన భక్తులు ఈ క్రింద నెం. కు ఫోన్ చేసి వివరములు తెలిసికొనగలరు.

ఫోన్ నెం: **9493412550**


సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

శ్రీ మాస్టర్ యూనివర్సల్ సాయి ట్రస్ట్‌కు ఎటువంటి బాధ్యతా లేదు.

# నిత్య జీవితంలో ధర్మాధర్మాలను నిర్ణయించడం ఎలా?

ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

మన సమాజంలో  అతి చిత్రము, దురవగాహమూ అయిన అంశాలలో వర్ణవ్యవస్థ ప్రధానమైనది. ఒక వంక, అది ఆర్షమూ, వైదికమూ కనుక ఎట్టి పరిస్థితులలోనూ వర్ణ భేదాన్ని పాటించి తీరాలని చెప్పేవారు కొందరు. అది మానవత్వానికే కళంకమని, ప్రకృతిలో అన్ని విధాలా సమానులైన మనుషుల మధ్య అగాధమైన భేదాన్ని సృష్టించి హిందూ సమాజాన్ని ఛిన్నా భిన్నం చేసినదనీ, కనుక దానిని ఎంత త్వరగా రూపుమాపితే అంతమంచిదనీ తలచేవారూ ఉన్నారు. ఈ రెండు దృక్పథాల మధ్యా అనిశ్చింతలో వూగిసలాడే వారెందరో! 'ఎవరిష్టం వారిది!' అని సమాధానపడడానికి వీలులేని అంశాలు యిందులో యిమిడి యుండడంచేత  యిరు పక్షాలతో రాజీపడ దలచినవారికి జీవితంలో ప్రతి చిన్న సందర్భంలోనూ అంతస్సంఘర్షణ తప్పదు. స్వధర్మాన్ని విడనాడితే యిక పారమార్థిక వికాసమే ఉండజాలదన్న శాస్త్రవాక్యాలు ఒక వంక కళ్ళెర్రజేస్తుంటే, 'ఏ కారణం గానైనా సాటి మానవుణ్ణి అనుమానంగా చూడడం సమర్థనీయంగాదన్న అంత:కరణ  బోధ పిడికిలి బిగిస్తుంది. ఈ సమస్యను పరిష్కరించుకోనంత సేపు ఏ పని చేసినా ఆ అంశం మేరకు శంక మిగిలివుండి చిత్తశుద్ధి లోపిస్తుంది. అంతకంటే మనిషికి బలహీనత యింకొకటి వుండదు. అది ఆత్మవిశ్వాసానికే తీరని దెబ్బ!

ఈ సమస్యకు పరిష్కారం అనుకొన్నంత కష్టం గాదు.  ధర్మానికంతటికీ మూలమైన మనుస్మృతి ఇలా చెబుతుంది:

శ్లో ।। "శ్రుతి స్మృతి: సదాచార: స్వస్యచ ప్రియమాత్మన:।
ఏతచ్చతుర్విధం ప్రాహు: సాక్షాద్ధర్మస్య లక్షణమ్।।          (2:2)

తా।। శ్రుతి, స్మృతి, సత్పురుషుల ఆచరణ, ఆత్మసంతుష్టి యీ నాలుగూ ధర్మం యొక్క లక్షణాలనీ పెద్దలు చెబుతారు."

శ్రుతి అంటే వేదాలు, స్మృతి అంటే ధర్మ శాస్త్రాలు, సదాచారమంటే సత్పురుషుల ఆచరణ విధానం. చివరిది ఆత్మ సంతృప్తి ఒక పని ధర్మ బద్ధమైనదేనన్నది.

మొదట వేదం ఒక విషయంలో నిర్ణయమేమి చేసిందో అర్థమవ్వాలి . దాని కనుగుణంగా స్మృతి ఆ విషయంలో చెప్పినది తెలియాలి. ఇవి రెండూ సామాన్యులకర్థమయ్యేవిగావు. కనుక సత్పురుషుల ఆచరణ విధాన్ని బట్టి మొదట రెండింటినీ తెలుసుకోవచ్చు. అలాంటి వారు మనకర్థం కాని దానిని వాచా వివరించగలరుగూడ- యుద్ధరంగంలో అర్జునుడికొచ్చిన సందేహాన్ని, శ్రీ కృష్ణుడు తీర్చినట్లు. ఇన్నీ వున్నా కూడా చివరి అంశమైన ఆత్మసంతృప్తి కూడా వుండాలి. అందుకే మనుస్మృతి యిలా అంటుంది:-

శ్లో।। సర్వంతు సమపేక్ష్యేదం నిఖిలం జ్ఞాన చక్షుషా ।
శ్రుతి ప్రామాణ్యతో విద్వాన్ స్వధర్మ నివిశేతవై ।।

తా।। "ఈ ధర్మశాస్త్రాన్నంతటినీ వివేకి తన జ్ఞాన నేత్రంచేత పరిశీలించి యిది వేద ప్రామాణికమని తెలిసి ఆచరణకుపక్రమించాలి."

అంటే తాను చేసే పని వేద ప్రామాణికమన్న ఆత్మసంతృప్తికరమైన విశ్వాసం కల్గితేనే ఆచరించాలి. కారణం అలాటి విశ్వాసానికి బదులు శంకతో, సందేహంతో, అసంతృప్తితో, విముఖతతో ఆచరించినది ధర్మం కావడానికి వీలులేదు. ఒక్క ఉదాహరణ: ఒక పేదవాడికి దయతో యిచ్చినది దానమవుతుందిగాని, రేపు ఎన్నికలలో వాడు ఓటు వేస్తాడనో, లేకుంటే వాడు సాటివారితో ముఠాకట్టి రేపు మనకెదురు తిరుగుతాడనో భయపడి యిచ్చింది దానం కాదు గదా! ధర్మానికి భావం మూలం. అందుకే శ్రీ కృష్ణుడుగూడ భగవద్గీతలో అనేకసార్లు ధర్మ సూక్ష్మం వివరించాకగూడ అర్జునుడితో "యధేచ్ఛసి తథాకురు" చివరికి నీకేది నచ్చితే అదే చేయి" అంటాడు. అంటే కృష్ణుడు చెప్పినది ధర్మబద్ధమన్న విశ్వాసముంటేనే అది చేయడం వలన ఫలితముంటుంది.

ఈ విషయంలో సామాన్యులకు శ్రుతిని, స్మృతిని జ్ఞాన చక్షువుతో పరిశీలించడం సాధ్యమవదు. అపుడు కర్తవ్యం సదాచారమే. అంటే సత్పురుషుల అచరణే. దీని ప్రాధాన్యత తెలియడానికే పైన ఉటంకించిన మొదట శ్లోకంలో మనువుగూడ చివరికి "ప్రాహు:", "తెలిసిన పెద్దలు చెబుతారు" అన్నాడు. అతడికి గూడ అదే ప్రమాణమన్నమాట.

ఇక ఆత్మవేత్తల సదాచారమే శ్రుతి, స్మృతులకు వివరణ అన్న అంశాన్ని మరింత స్పష్టంగా మనువిలా సూచించాడు.

శ్లో॥ భూతానాం ప్రాణిన: శ్రేష్ఠా: ప్రాణినాం బుద్ధి జీవన: ।
బుద్ధిమత్సు నరా: శ్రేష్ఠా నరేషు బ్రాహ్మణా స్మృతా:॥
బ్రాహ్మణేషుచ విద్వాంసో విద్వత్సు కృత బుద్దయ: ।
కృత బుద్ధిషు కర్తార: కర్తృషు బ్రహ్మవేదిన: ॥ (1:97,98)

తా॥ సృష్టించబడిన వాటన్నింటిలో ప్రాణులు, వాటిలో బుద్ధిగల జీవులు, బుద్ధిజీవులలో నరులులో బ్రాహ్మణులు, బ్రాహ్మణులలో విద్వాంసులు, వారిలో శాస్త్రోక్తానుష్ఠానమందు బుద్ధిగల వారు, అట్టి వారిలో అనుష్ఠించువారు శ్రేష్ఠులు, వీరందరిలో బ్రహ్మవేత్తలు శ్రేష్ఠులు." అంటే వీరే శ్రుతి స్మృతుల సారాన్ని బోధించగల వారిలో ఉత్తములన్నమాట. వారిమాట, ఆచరణా ధర్మానికి ప్రమాణాలు. ఇందుకు మరొక కారణం గూడ వున్నది. బ్రహ్మవేత్తలు సర్వకాలాలలోనూ ఉంటారు. ఆయా దేశకాల స్థితులలో ఉత్తమమైన ధర్మాన్ని ప్రజలకు లభింపజేయడానికి అవసరమైన, సాధ్యమైన రీతిన ఆచరణకు మార్గము తెల్పుతారు. తదితరులైన మానవులు రెండు రకాలుగా ఉంటారు. మారుతున్న దేశకాల పరిస్థితులలో ప్రాచీన కర్మకాండను నిర్దుష్టంగా ఆచరించ సాధ్యంగాక దానిని విడిచిపెట్టడమన్నా చేస్తారు. లేక అప్రధానమైన బాహ్యచారానికి మూఢంగా అంటి పెట్టుకొని దాని ఆంతర్యాన్ని కోల్పోతారు. ఉదాహరణకు పైన ఉటంకించిన "సర్వంతు సమవేక్ష్యేదం" అన్న శ్లోకాన్ని యిట్టివారు విస్మరిస్తారు. దీనికి ఉదాహరణ, ధర్మశాస్త్రంలో యుద్ధానికి పిలువబడ్డ రాజుయొక్క ధర్మం స్పష్టంగా ఉన్నా దానిని మరచి అర్జునుడు అధర్మాన్ని పరమ ధర్మంలా భగవద్గీత మొదటి అధ్యాయంలో వల్లించడం చూస్తాము. అలాటి పరిస్థితులలో ధర్మ స్వరూపాన్ని సమగ్రంగా ఎఱిగిన బ్రహ్మవేత్త ధర్మసూక్ష్మం విచ్ఛిన్నంగాకుండా ఆచరణను ఎలా మలచుకోవాలో శ్రీ కృష్ణుడు బోధించినట్లు బోధిస్తాడు. అందుకే అట్టివారిని ముముక్షువు ఆశ్రయించితీరాలని శ్రీ కృష్ణుడు భగవద్గీత అధ్యాయం 4, శ్లోకం 32లో చెప్పాడు. రాముడు తాటకి స్త్రీ అని వెనుకాడుతుంటే సర్వధర్మజ్ఞుడైన విశ్వామిత్రుడు కర్తవ్యాన్ని బోధించాడు. సామాన్య శోత్రీయులు తలచినంత తేలికగాదు ధర్మ నిర్ణయం. దానిని నిర్దుష్టంగా చేయగలగాలంటే భగవద్గీతలో దైవీసంపద, సాత్విక లక్షణాలుగా చెప్పబడిన సద్గుణాలన్నీ వుండాలి. అవి బ్రహ్మవేత్తలకు గాని వుండజాలవు.

కనుక యీకాలంనాటి మనం మొదట ప్రస్తావించిన ధర్మసందిగ్ధమైన జీవితాంశాల విషయంలో యీనాటి బ్రహ్మవేత్తలైన శిరిడీ సాయిబాబా, శ్రీ అక్కల్‌కోట స్వామి, శ్రీ గజానన్ మహరాజ్, శ్రీ రమణ మహర్షి, శ్రీ రామకృష్ణ పరమహంస వంటి వారు సూచించిన మార్గాన్నే నడవాలి. అటు అల్పజ్ఞులైన మూఢాచారపరాయణులు చెప్పినట్లుగాదు, యిటు సర్వాచార భ్రష్టులైన స్వేచ్ఛా జీవులు చెప్పినట్లుగాదు. కేవల బాహ్యాచార రీతులే ధర్మమనుకొంటే కొన్ని సమాధానంలేని ప్రశ్నలెదురవుతాయి. ప్రాచీన హిందూ ఆచారకాండే పరమార్థానికి మార్గమను కొంటే అందుకు వ్యతిరేకంగా కనుపించే ఆచారంగల యితర మతాలలో వెలసిన సిద్ధపురుషులెలా పూర్ణత్వాన్ని చెందగల్గారు? ఆయా మతాలవారు వారి ఆచారాలే దివ్యాదేశాలని, అవి మాత్రమే శ్రేయస్కరమనీ నమ్ముతున్నారు. వారి అభిప్రాయాలే నిజమైతే మన ధర్మంలో అవతరించిన మహనీయుల మాటేమిటి? ఇలా యింకెన్నో! ఈ వైవిధ్యం చూస్తుంటే విజ్ఞాన శాస్త్ర ప్రభావానికి గురవుతున్న మన యువతరానికి ఏ ధర్మం సత్యమో ఎలా నిర్ణయించాలన్నది అర్థం కాదు. అంత విరుద్ధంగా కన్పించే ఆయా మత ధర్మాలన్నీ ఎలా సత్యాలవడం సాధ్యమన్నదీ అర్థంగాదు. అసలు మతాలే మూఢ విశ్వాసాలేమోనన్న అభిప్రాయం దృవపడుతుంది వారికి. ఇలాటి పరిస్థితులలో ముముక్షువులందరూ బ్రహ్మవేత్తలైన సిద్ధపురుషుల మార్గాన్ననుసరిస్తే యీ సమస్య పరిష్కారమవుతుంది.

# సద్గుర్వనుగ్రహము

ఫిబ్రవరి తొమ్మిది ప్రత్యేక వ్యాసం

అమ్మ

ఫిబ్రవరి తొమ్మిది. పూజ్యశ్రీ ఆచార్య భరద్వాజ మాస్టరుగారిని ఆరాధించేవారందరికీ అతి ముఖ్యమైన, ప్రీతికరమైన రోజు. కారణం-ఆ రోజు పూజ్యశ్రీ మాస్టరుగారు శిరిడీలో లేకుంటే, శిరిడీ సాయిబాబా వలన అట్టి అనుభవాన్ని పొందకుంటే ఈ రోజు మనమిలా సాయిని సేవించేవాళ్ళము కాదేమో!

ఆ రోజు పూజ్యశ్రీ మాస్టరుగారు, శిరిడీ సాయిబాబా యొక్క పరిపూర్ణ అనుగ్రహాన్ని పొందిన రోజు. శిరిడీ సాయి సన్నిధిలో ఆయన ఆత్మానుభవాన్ని పొందినరోజు. ఆ క్షణం నుంచి ఆయన మనసా, వాచా, కర్మణా శ్రీ సాయినాథునికి అంకితమై ఆయన మహిమను దశదిశలా వ్యాపింపజేసారు.

ప్రథమదర్శనంలోనే ఆయన అంతగా సాయినాథుని అనుగ్రహాన్ని ఎలా పొందగలిగారు? దానికి కారణాలేమిటి?

అంటే అప్పటివరకూ పూజ్యశ్రీ మాస్టరుగారు చేసిన అన్వేషణ, సాధనలు ఫలించి ఆయనకు సాయి అనుగ్రహం లభించిందని ఒక్క మాటలో చెప్పుకోవచ్చు.

నిజానికి ఆయన చిన్నప్పటినుండీ అన్వేషకులే. చిన్నప్పుడు మాతృదేవి మరణంతో ప్రారంభమైన అన్వేషణ ఆయన అన్నగారి అబ్బాయి మరణంతో తీవ్రతరమైంది. దానితో ఆయన బుద్ధునివలెనే జనన మరణ చక్రాన్ని, సృష్టి తత్త్వాన్ని తరచి తరచి తెలుసుకున్నారు.

పూజ్యశ్రీ మాస్టరుగారు మొదటినుంచే ఏ విషయాన్నైనా క్షుణ్ణంగా తెలుసుకోనిదే వదిలిపెట్టేవారు గాదు. అన్ని విషయాలలోనూ ఆయనకు ప్రశ్నల చిట్టా వుండేది. సమాధానపడేవరకూ వదిలిపెట్టేవారుగాదు.

అందుకనే అసలు ఆధ్యాత్మికత అంటే ఏమిటి? ఆధ్యాత్మిక తత్త్వవేత్తలు ఎలా వుంటారు! భగవంతుడు వున్నాడా! వుంటే ఎలా వుంటాడు! ఆయన తత్త్వమేమిటి? అని తెలుసుకోవడానికి ఎన్నో పుస్తకాలు చదివారు. ఆలోచించారు.

అసలు మతమంటే ఏమిటి? అవి ఎలా ఉద్భవించాయి? ఇన్ని మతాలు ఎందుకు ఏర్పడ్డాయి? అవి బోధించేదేమిటి? ఇవి తెలుసుకోడానికి మతాలగూర్చి అన్ని గ్రంథాలూ చదివారు. వాటి తత్త్వాన్ని గూర్చి తెలుసుకున్నారు.

'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయో:' అన్న వాక్యాన్ననుసరించి ఆయన కాలేజీ వయసులో వున్నప్పుడే మనస్సును గూర్చి ఆలోచించి దానిని తన ఆధీనంలోకి తెచ్చుకున్నారు. మనస్సు చెప్పినట్లు తాము వినకుండా తాము చెప్పినట్లు మనస్సు వినేలా చేసుకున్నారు. మనస్సుకు ఏది చేయాలనిపిస్తే దానికి వ్యతిరేకంగా చేసేవారు. కూర్చోవలసివస్తే గంటల తరబడి నిలుచునేవారు. నిలబడాలనిపిస్తే కూర్చునేవారు. పడుకోవాలనిపిస్తే లేచి తిరిగేవారు. నిద్రపోవాలనిపిస్తే మెలుకువగా వుండేవారు. బయటకు వెళ్ళాలనిపిస్తే ఇంట్లోనే వుండేవారు. ఇంట్లో వుండాలనిపిస్తే బయటకు వెళ్ళేవారు. తినాలనిపిస్తే ఉపవాసం వుండేవారు. తినవద్దు అనిపిస్తే విపరీతంగా తినేవారు, నడుస్తున్నప్పుడు కాసేపు ఆగుదామని అనిపిస్తే అలా అనిపించకుండా వుండేదాకా మైళ్ళ తరబడి నడిచేవారు.

అంతేగాదు, ఆయన ఎన్నో రోజులు ఆహారం తీసుకోవడం మానేసారు. కొంతకాలం ద్రవపదార్థాలు మాత్రమే తీసుకున్నారు. అలాగే కొన్ని రోజులు ద్రవపదార్థాలు అసలు తీసుకోకుండా ఘనపదార్థాలు మాత్రమే తీసుకున్నారు. అలాగే మూత్ర బంధనము, మలబంధనము చేసారు. మామూలుగా మానవుడు యివి జరగకుండా ఎన్నిరోజులు జీవించగలడో అన్నిరోజులకంటే మూడురెట్లు ఎక్కువగా యివన్నీచేసారు. నిద్రలేకుండా ఎన్నోరోజులు గడిపారు. అంతేగాక

ఆయన చేసిన సాధనలు ఎన్నో వున్నాయి.

అంటే ఆయన కోరికలను నశింపజేసారు. కోరిక ఎప్పుడైతే నశిస్తుందో, దాని వలన ఉద్భవించే రాగ, ద్వేష, అసూయాది భావాలు నశిస్తాయి. అందుకని ఇక సాధించడానికి ఆయనకు ఏమి మిగిలింది? అంటే ఆయన సాధనంతా పూర్తయిందన్న మాట! ఇక సద్గురువనుగ్రహమే కావాలసింది!

అందుకే - పూజ్యశ్రీ మాస్టరుగారు అట్టి అర్హత సంపాదించారు గనుకనే-శ్రీ శిరిడీ సాయినాథుడు ఆయనను తమ శిష్యునిగా అంగీకరించి తమ సంపూర్ణ అనుగ్రహాన్ని ప్రసాదించారు. తమవంటివారిని చేసారు.

ఇక్కడ కొందరికి ఒక సందేహము కలుగవచ్చు. 'శ్రీ సాయి పూజ్యశ్రీ మాస్టరుగారిని తమవంటివారుగా చేస్తే ఆయన గూడ శ్రీ సాయిలాగా జీవించాలిగదా! మరి వేరుగా వున్నారెందుకని?' అని. ఈ ప్రశ్నకు సమాధానం సాయియే. శ్రీ సాయిని తమ గురువు పరిపూర్ణుని చేసారు. అయితే సాయి తమ గురువులాగా వున్నారా? ఎందుకుండలేదు? ఇక్కడ మనం గమనించవలసిన విషయమొకటున్నది. తమ గురువువలన పరిపూర్ణులైన వారుగురువు వలె వుండరు. గురువు తమను ఎలా వుంచుతారో అలా వుంటారు! అదే విధంగా పూజ్యశ్రీ మాస్టరుగారు తమ గురువు తమను ఎలా వుంచారో అలా వున్నారు.

అసలు అనుగ్రహం అంటే ఏమిటి? పూజ్యశ్రీ మాస్టరుగారు అనుగ్రహం గురించి యిలా చెప్పారు: "భగవంతుని అనుగ్రహము నిరంతరం వర్షిస్తూనే వుంటుంది. దానిని గుర్తించడము, దానిని విశేషంగా పొందే యత్నం చేయడమే కావలసినది. ఈ రోజు మనం యిలా జీవించగలుగుతున్నామంటే అంతా ఆయన అనుగ్రహమే. మన చుట్టూ ఎప్పుడూ ఎన్నో ఉపద్రవాలు పొంచేవుంటాయి. వ్యాధులనుండి, ప్రకృతి వైపరీత్యాలనుండి, వ్యక్తులనుండి-యిలా ఎన్నో విధాల ఆయన మనలను కాపాడుతున్నాడు. ఇది తెలుసుకుంటే భగవంతుడు మనలను ఎంతగా అనుగ్రహిస్తున్నారో అర్థమవుతుంది.

అంతేగాదు, మనకు వచ్చే కష్టాలు గూడ ఆయన అనుగ్రహమేనని పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పేవారు. మనం చేసే పొరపాట్లకు ఆయన యిచ్చే శిక్ష, శిక్షణ గూడానని ఆయన చెప్పేవారు. చేసిన తప్పులను తెలుసుకోవడానికి, వాటిని తిరిగి చేయకుండా వుండడానికి మనం మన పిల్లలను ఎలా శిక్షిస్తామో అలాగే ఆయన గూడా చేస్తారని పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పేవారు. మనం సరియైన మార్గాన నడవడానికి అవి దోహదపడతాయని ఆయన చెప్పేవారు.

"అయితే పూజ్యశ్రీ మాస్టరుగారికి వచ్చినంతటి అనుగ్రహము మనకు అవసరమా?'' అని మనకనిపించవచ్చు. అలా అనిపించడమంటే ఏమిటంటే మనకు శాశ్వతమైన తృప్తి శాంతులు అవసరం లేదని మనమనుకుంటున్నామన్నమాట. మరొక రకంగా చెప్పాలంటే అంతటి తృప్తి శాంతిని పొందిన వారి వద్దనుండి మనం కొద్ది కొద్దిగా మాత్రమే; అంటే మన సమస్యలు తీరడం వల్ల వచ్చే శాంతిని మాత్రమే మనం కోరుకుంటున్నామన్నమాట. కానీ అది శాశ్వతంగా వుండడం లేదుగదా! కోరికల వెంబడి కోరికలు తెంపు లేకుండావస్తూనే వుంటాయి. నిరంతరం మనం సమస్యల సుడిగుండంలో చిక్కుకుపోతూ వాటికోసం మహాత్ముల దగ్గరకు పరిగెత్తుతూనే వుంటున్నాం గదా! వాటిలో కొన్ని తీరవచ్చు, తీరకపోవచ్చు. మరి మనకు తృప్తి శాంతి ఎంతవరకూ వచ్చినట్లు? దీనికి పరిష్కారం ఏమిటి?

ఈ ప్రశ్నలకు సమాధానమే పూజ్యశ్రీ మాస్టరుగారి జీవితం. ఆయన ఒక్కొక్క సమస్య కోసం భగవంతుని అడగడంగాక ఈ సమస్యలన్నింటికీ మూలమైన దానిని సాధించారు. శాశ్వత శాంతిని పొందారు. అందుకని మనం శాంతిని కోరుకుంటున్నప్పుడు అట్టి శాంతి కోసం తప్పక అట్టి

ప్రయత్నం చేయవలసినదే! అటువంటి అనుగ్రహాన్ని పొందవలసినదేనని చెప్పక తప్పదు.

అయితే మనం అంతటి కఠినతరమైన సాధన చేయగలమా? మనకంతటి మనోబలం వున్నదా? మరి మనం సాయినాథుని అనుగ్రహాన్ని పొందడం అసాధ్యమా? అనే చింత మనకు కలగవచ్చు. అందుకే పూజ్యశ్రీ మాస్టరుగారు యిలా చెబుతుండేవారు. "ఒక్కొక్క విషయాన్ని గూర్చి నేనెంతో కష్టపడి తరచి తరచి ఆలోచించి, సంవత్సరాల తరబడి అన్వేషించి తెలుసుకున్న విషయాలను అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లు, అతి సులభమైన మార్గాలను మీకు చెబుతున్నాను. ఎందుకంటే నాకానాడు ఎవ్వరూ చెప్పలేదు కనుక నేనే స్వయంగా తెలుసుకోవలసి వచ్చింది. ఇప్పుడు మీకు కష్టం లేదు. నేను చెప్పినవాటిని ఆచరిస్తూపోతే చాలు. మీరు తప్పక సాయి యొక్క సంపూర్ణ అనుగ్రహాన్ని పొందగలరు".

అయితే పూజ్యశ్రీ మాస్టరుగారు ఏం చెప్పారు? ఆ సంగతి మనందరికీ తెలుసు! మహాత్ముల చరిత్రలు పారాయణ చేసుకోమని, సత్సంగాలు చేసుకోమనీ చెప్పారు. నిరంతరం సాయిని స్మరించమని, అందరిలో ఆయనే వున్నాడని చూడమని, అందరూ కలిసి మెలసి జీవించమనీ-యిలా యింకా ఎన్నో ఎన్నెన్నో!!!

వీటిలో కొన్నింటిని మనం చేస్తున్నాము, కొన్నింటిని చేయడానికి ప్రయత్నిస్తున్నాము. కానీ ఏది చేసినా ఎలా చేయాలో ఆయన చెప్పిన మూలసూత్రాన్ని పాటించకపోతే వ్యర్థమని ఆయన చెప్పిన మాటను గుర్తుంచుకోవాలి.

ఉదాహరణకు సత్సంగాలు చేయడము, సత్సంగాలకు వెళ్ళడము దాదాపు అందరమూ చేస్తూనే వున్నాము. సత్సంగాలు చేస్తున్నప్పుడుగానీ సత్సంగాలకు వెళ్తున్నప్పుడుగానీ మన ప్రవర్తన, మన ఆలోచనలు ఎలా వుంటున్నాయి? ఆయా విషయాలలో పూజ్యశ్రీ మాస్టరుగారు ఏయే జాగ్రత్తలు చెప్పారు? అనేది గమనించుకోవాలి.

'నేను మస్టరుగారు చెప్పినవిధంగా సత్సంగాలు చేస్తున్నాను, ఇన్ని సత్సంగాలు చేసాను. నన్ను వాడు గౌరవించడా?' అని ఎప్పుడైనా అనిపించడము, అనడమూ జరిగిందనుకుందాం. దాని వెనకాలవున్న భావమేమిటో ఆలోచించుకోవాలి. అంటే మనం సత్సంగాలు చేస్తున్నామన్న అహంకారము, మనం గొప్పవాళ్ళమన్న గర్వము, మనలను యితరులు గౌరవించాలన్న కీర్తికాంక్ష-వున్నాయని అర్థం. మనలను నలుగురూ గౌరవించడము, మనలను కార్లలో త్రిప్పడము, ఎక్కడెక్కడికో సత్సంగాలకు తీసుకెళ్ళడము, విదేశాలకు తీసుకువెళ్ళడము, మనకు అనుచరులు లక్షల కొద్దీ వుండడమూ-ఇవేవీ మన ఉన్నతికి సరియైన కొలబద్దలు కావు. మనలోని బలహీనతలను గుర్తించి, వాటిని తొలగించుకోవడానికి ఎంతగా ప్రయత్నిస్తున్నాము అన్నదే పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పిన దానిని అమలు పరుస్తున్నామనడానికి నిదర్శనం. ఒక ప్రక్క ఆయన చెప్పినట్లు సత్సంగాలు మొ॥నవి చేసుకుంటూ, మరొకప్రక్క మనలోని బలహీనతలను తొలగించుకుంటూ పోతుండడమే పూజ్యశ్రీ మాస్టరుగారి అనుగ్రహానికి పాత్రులమవడానికి, అర్హత సంపాదించు కోవడానికి మార్గము.

అందుకని ఈ ఫిబ్రవరి తొమ్మిదిని పురస్కరించుకుని (9.2.2010) మనలను మనం సరిదిద్దుకునే ప్రయత్నం చేద్దాం.

జై సాయి మాస్టర్ !!!

జనవరి సంచిక తరువాయి

# వార్తాలాపము

(సీరియల్)

## సచ్చిదానంద రూపము

తండ్రి చెప్పెను,

యథా సౌమ్యైకేన మృత్పిణ్డేన సర్వం మృణ్మయం విజ్ఞాతం స్యాత్ వాచారమ్భణం నామధేయం మృత్తికేత్యేవ సత్యం ఏవం సౌమ్య స ఆదేశో భవతీతి ।

"ఓ కుమారా! మట్టి యొక్క వికారములగు కుండ, కడవ మొదలగువానియందు ఉపాదాన కారణమగు మృత్పిండము తెలిసినచో మృద్వికారములగు పాత్రములన్నిటి జ్ఞానమును కలుగునట్లుగనే సత్, చిత్, ఆనంద స్వరూపమగు ఒక తత్త్వమును మాత్రమే తెలిసికొనినచో ఆసత్ (కాలత్రయా బాధితము) చిత్ (చైతన్యరూపము) ఆనంద (ప్రియము) రూపముతో కూడిన పదార్థములన్నియును తమంతట తామే తెలియును. ఓ కుమారా! ఇది ఆదేశజ్ఞానము. అనగా గురుపరంపరద్వారా లభ్యమగు జ్ఞానము."

ఈ విధంగా శ్వేతకేతునకు అనేక దృష్టాంతములతో తత్త్వ జ్ఞానయోగ్యతయు, జిజ్ఞాసయు కలిగించుటకు ఉద్దాలకుడు ఉపదేశించెను. అనంతరము చెప్పెను. "స య ఏషో2ణిమైతదాత్మ్యమిదం సర్వంతత్ సత్యం స అత్మా తత్త్వమసి శ్వేతకేతో"

"అదియే అణురూపములోనున్న ఆత్మ. ఈ సమస్త ప్రపంచము దాని స్వరూపమే. అది సత్యరూపమగు పరబ్రహ్మము. ఓ శ్వేతకేతూ! అది నీ స్వరూపమే. నీవు కూడ ఆ రూపమే."

ఇట్లు శ్వేతకేతునకు దృష్టాంతములద్వారా ఈ అభిప్రాయమును 9 మార్లు ఉపదేశించెను. వానినుండి ఒక దృష్టాంతము తీసి కొనుడు.

## సత్యస్వరూపమగు పరబ్రహ్మము

నదులు అనేకదిశలనుండి వెలువడి సముద్రములో కలియును. అవి సముద్రరూపమును పొందును. అనంతరము వానికి నేను ఫలానా నదిని అను ద్వైతబుద్ధి యుండదు. అటులనే ఈ ప్రజలందరును సత్పదార్థమునుండియే ఆవిర్భవించిరి. తాము సద్రూపులు అని వారికి తెలియదు. సత్ పదార్థమునుండియే జన్మించితిమనియును ఎరుగరు. వ్యాఘ్రం, సింహం, వరాహాదిరూపములు కూడ సద్రూపములే. సద్రూపము అగు సూక్ష్మకారణబ్రహ్మముయొక్క కల్పితాంశమునందు వ్యాఘ్రాదులు ఆవిర్భవించినవి. కారణరూపమగు సూక్ష్మ ఆత్మ అదియే. దాని స్వరూపమే ఈ సమస్త ప్రపంచమును. అదియే సత్యస్వరూపమగు పరబ్రహ్మము. ఆ సత్యస్వరూపమగు పరబ్రహ్మమే నీ స్వరూపము. అది నీవు.

## అభేదమును బోధించు శ్రుతులు

శ్రుతులు స్పష్టముగా ప్రకటించుచున్నను అధికారభేదముచే ఆచార్యులు తమతమ సంప్రదాయములయందు ద్వైతమునకు వాటిని అనువర్తింపజేసిరి. ఆయా సంప్రదాయముల ఆచార్యులు ఇతర మతములను ఖండించి తమ మతమే వేద సమ్మతమయినది అని జగమును నమ్మించప్రయత్నించిరి. అయినను సూక్ష్మబుద్ధితో-

"తం స్వాచ్ఛరీరాత్ ప్రవృహేన్ముఞ్జాదివేషికాం ధైర్యేణ."

"ముంజగడ్డినుండి ఈనెను తీయుటకు చాలా శ్రద్ధవహించవలెను. అటులనే తన దేహముకంటే ఆత్మను వేరుగా తెలిసికొనుటకు ప్రయత్నించవలెను.-" తత్త్వమస్యాది మహావాక్యములను వినినతరువాత మనననిదిధ్యాసనములు చేయవలెను. అంతట తననే తన స్వరూపమగు శుద్ధబ్రహ్మస్వరూముగా భావించును.

**అద్వైతము రాజమార్గము**

ఒకటితప్ప మరి ఏ అంకెయును వాస్తవికమయినది కాదు. మిగిలినవి అన్నియు సాపేక్షములగుటచే కల్పితములు. ఏకత్వము ఎల్లకాలములయందును అకల్పితము. రెండుపుస్తకములున్న ద్విత్వ బుద్ధి కలుగును. కాని "ఇది ఒక పుస్తకము , ఇది ఒక పుస్తకము." అను ఏకత్వబుద్ధి ప్రత్యేకముగా ప్రతి పుస్తకమునందును ఉండుతచేతనే ఆ ద్విత్వబుద్ధి కలుగును. ఇట్లు ద్విత్వము అపేక్షాబుద్ధిజన్యమును, ఏకత్వబుద్ధ్యధీనమును అయియున్నది. ఏకత్వము అన్యోన్యాపేక్షము. ఎట్లన, ధాన్యపుగింజలరాశి ఒకటైనను అందు కణకణసాపేక్షముచే అనేక కణములు ఉండును. ఇది ఒక వడ్లగింజలరాశి అనునది అనపేక్షమగు ఏకత్వబుద్ధి. ఇదేవిధముగా అన్యనిరపేక్షమగు ఏకత్వమునందు అపేక్షాబుద్ధి వీలు పడినది. అట్లు చేసినను కేవలము అద్వైతబ్రహ్మము నందు ఏవిధమగు వికృతియును సంభవించదు. పర్వతముపైకి వెళ్ళువారిలో కొందరికి కష్టమైనను దగ్గరత్రోవ నచ్చును. కొందరికి చుట్టు అయినను కష్టములేని త్రోవ నచ్చును. అటులనే బుద్ధిభేదముచే వేరు వేరు అధికారులకు ఆచార్యులు వేరువేరు మతములను ప్రవచించిరి. కాని రాజమార్గము అద్వైతమనునది నిర్వివాదము. శాస్త్రము చెప్పుచున్నది.

చతుర్థో రాజయోగ: స్యాత్ తద్విధాభావవర్జిత:

"నాలుగు యోగములయందును ద్వైతభావరహితమయినది రాజయోగము."

క్రమముగా అద్వైతప్రతిపాదకములగు ఋగ్యజుస్సామాధర్వ వేదములందలి మహావాక్యములను విచారించుడు.

ప్రజ్ఞానం బ్రహ్మ, అహం బ్రహ్మాస్మి, తత్త్వమసి, అయమాత్మబ్రహ్మ.

ఈ నాలుగగు మహావాక్యములను పరమాత్మ అనబడు శుద్ధ బ్రహ్మమునకును, జీవునకును అభేదమును బోధించును. కాని మానవునకు భూత, భావి, వర్తమానములనబడు మూడు రకముల ప్రతిబంధములలోను ఏది మిగిలియున్నను తత్త్వజ్ఞానముయొక్క అపరోక్ష (ప్రత్యక్ష) అనుభూతి జరుగదు.

వార్తికకారులు చెప్పిరి.

కుతస్తద్జ్ఞానమితి చేత్ తద్ధి బన్ధపరిక్షయాత్।

అసావపిచ భూతో వా భావీ వా వర్తతేథవా॥

"ఈ అపరోక్షజ్ఞానము ఎట్లు కలుగును? అని అడిగినచో దానికి సమాధానముగా బంధము భూతము, భావి, వర్తమానము అని మూడు విధములు.

ఈ ప్రతిబంధకములు వాటి నివృత్తికి ఉపాయములు అనునవి శ్రీవిద్యారణ్యస్వామివారి పంచదశియందలి జ్ఞానదీపప్రకరణమున చెప్పబడినవి.

- సశేషం

# శ్రీ భరద్వాజ లేఖామృతము

OM SADGURU SRI SAINAADHAYA

E. Bharadwaja M.A.,
DWARAKAMAYI
P.O. VIDYANAGAR-524413
Nellore Dt. (A. P.)

Date 21/1/78

[illegible]

[illegible] 15,20 letters [illegible]

[illegible] 'The Supreme Master' [illegible] address [illegible] Hyd., Sec'bad [illegible]

1. Sri G.V.R. Naidu, Sai Baba Samaj, Sri Ronald Ros Road, Nallagutta, Sec'bad.
2. Sri C. Sambamurthy, Shirdi Sai Prema Mandir, Chickadpalli, Hyd.

# శ్రీ భరద్వాజ లేఖామృతము

**E.Bharadwaja**, M.A.,
DWARAKAMAYI,
P.O.VIDYANAGAR-524413
Nellore Dt. (A.P)

**Date: 21/1/78**

శ్రీమతి కమలా రామచందర్ గార్కి,

నమస్కారములు. మీరు 19.1.78న వ్రాసిన జాబు చేరినది. ఇదివరకు నేను ఇక్కడ నిర్మాణం కానున్న సాయిమందిర్ కరపత్రం, శిరిడి సాయి కల్చరల్ మిషన్ కరపత్రములు పంపుతూ సాధ్యమైన సహకారాన్నందజేయమని కోరాను. మరలా మరొక ప్రతి ఇందు పంపుతున్నాను. మీరు సాయిలీలామృతంలో 'విద్యానగర్‌లో సాయిలీలలు', 'పరిచయము' అన్న అధ్యాయాలలో గత 7సం॥లుగా ఇక్కడ జరుగుతున్న సత్సంగం విషయం చదివి ఉంటారుగదా. దానిని గురించి, ఇందు నేను పంపు మందిరము గురించి కరపత్రాలను మీరు చూచి, ఆ లక్ష్యాలను, ఆశయాలను మీకు తెలిసిన వారికి చెప్పి వారు సహృదయతతో మనస్ఫూర్తిగా ఎంత ఇచ్చినా సేకరించండి. కానీ వ్యక్తిగతమైన మోమాటాలనాధారంగా చేసుకొని వారిచ్చేలా ప్రయత్నమక్కరలేదు. అది బాబాకు సమ్మతం కాదు. అవసరమనుకుంటే వారికి ప్రయోజనముందనుకుంటే వారికి 'లీలామృతము' చూపించవచ్చు. వారికి బాబాపైన, మామీద సదభిప్రాయంతో ఇస్తేనే అవి స్వీకరించడం ధర్మం. ఇది ముఖ్యం.

నేను వెనుకటి జాబులో ఏమి వ్రాసానో నాకు కొంచెం కూడా గుర్తులేదు. కారణం రోజూ సగటున 15,20 letters వ్రాయడం కాలేజీ, సత్సంగం, ధ్యానం, గృహకృత్యం, హోమియో అధ్యయనం ఇలా ఎన్నో ఉంటున్నా అప్పటికి తోచినదప్పటికి వ్రాయడమే సాధ్యపడుతూ వెనుకటి జాబులో విషయాల గురించి యోచించలేదు. ఇప్పుడు కూడా నేను 2వ తేది నుండి 18 దాకా శిరిడీ మొ॥న చోట్లకు వెళ్ళి రావడంతో ఇన్ని రోజుల జాబులు ఇప్పుడు వ్రాస్తున్నాను. కనుక వివరంగా మరోజాబు కొంతకాలం తర్వాత వ్రాస్తాను.

మీరంతా సాయి స్మరణలో బాగా ఆనందంగా ఉన్నారని తలుస్తాను. ఉత్తరంలో అడ్రస్సులు వ్రాశాసన్నారు. బహుశః నేను వ్రాసిన 'ఏది నిజం?' 'నిజానికి నిచ్చెనలు', 'The Supreme Master' అను పుస్తకములు దొరికే addressలు వ్రాసి యుంటాను. ఆ పుస్తకాలొక్కటికూడా మిగలలేదు. కనుక Hyd'd , Sec'bad లో అవి కల మిత్రుల అడ్రసులిస్తున్నాను. మీరు చదివి వారికిచ్చివేయచ్చు.

1. Sri G.V.R. Naidu, Sai baba Samaj
   Sir Ronald Ross Road, Nallagutta, Sec'bad.
2. Sri C.Samba Murthy, Shirdi Sai Prema Mandir,
   Chikkadpalli, Hyd'd.

శ్రీ రామకృష్ణ పరమహంస జయంతి సందర్భంగా ప్రత్యేక వ్యాసం

# "పరమహంస"

సమిత్వాణి

మానవాకారంలో లోకోద్ధరణకై అవతరించే గురుతత్వం అనేక కాలాలలో అనేక రూపాలలో ప్రస్ఫుటమైనది. అలా అవతరించిన మహనీయులందరూ విశ్వవ్యాపకంగా ఏ నిజతత్వమైతే నిండి ఉన్నదో దానిని "గురువు" అని వ్యవహరించడం చరిత్ర విదితం. కొందరు పూర్ణులు అదే విశ్వ చైతన్యాన్ని "గురువు" అనే పేరుకు బదులు "తల్లి", "తండ్రి", "కృష్ణుడు", "జగన్మాత", "సత్యము" మొదలైన దివ్యమైన పదజాలంతో సత్కరించారు. పేరేది వాడినా వారందరూ ఆ పరతత్వాన్ని, ఆ విశ్వచైతన్యాన్ని ఎంతో భక్తితో సంబోధించి అట్టి భక్తిని తమను అనుసరించే వారికి విధించారు. చివరకు "నిర్గుణ" పరబ్రహ్మాన్నుపాశించే వేదాంతులు, అద్వైతుల రూపాలలో ప్రకటమైన మహనీయులు అట్టి అద్వైతాన్ని, దానిని చేరేమార్గాన్ని అలానే గౌరవించటం చూడవచ్చు.

మానవజాతి చరిత్రలో ఇటీవల(గత 2 వేల సం॥లు) కాలంలో అదే శక్తిని "తండ్రి"గా చూచే మతాలు, క్రైస్తవం, జుడాయిజమ్, ఇస్లామ్ మతాలు, "ధర్మకాయం" అని వివరించినది బౌద్ధం, వివిధ దేవతల, మహనీయుల పేరుతో సత్కరించింది హైందవం. ఇదే తత్వాన్ని అగ్నిగా, గణపతిగా, రుద్రునిగా, విష్ణువుగా, విరాట్‌గా, నారాయణునిగా, ఆదిత్యునిగా, లక్ష్మిగా, శ్రీ గా అభివర్ణిస్తాయి వేదాలు. ఇన్ని వివరణలు ఒకే విషయాన్ని వర్ణించటం, ఒకే విషయం ఇన్ని విధాలుగా కీర్తించబడటం చూస్తే, అలా అభివర్ణించినవారి ఆధ్యాత్మికానుభవం ఎంతలోతైనదో, వారు వర్ణించ యత్నించిన విషయాలు ఎంత అద్భుతమో, వర్ణనాతీతమో అనిపిస్తుంది. ఏ వివరణ అయినా అందుకొని, అనుష్ఠించి అనుభవగతం చేస్తేకానీ దాని సత్యం అవగతంకాదు.

ఇట్టి వర్ణనలన్నీ ఎంతగా వివరించినా ఆ వివరణను అందుకోగల పరిపాకం, అర్థం చేసుకునే సామర్థ్యం ఎక్కువ మందికి ఉండవు. తత్వం అవగతము అవ్వాలంటే సత్వగుణము, నిష్ఠ తప్పనిసరి అని వేదాలుసైతం చెప్తాయి.

రోజువారీ జీవితంలోనే యిాదలేక తలమునకలౌతున్న జన బాహుళ్యం తమకు నిత్యం అనుభవంలోనికిరాని సత్యాన్ని గూర్చిన వివరణలనందుకుని, అనుష్టించి, సహజం చేసుకోవటం ఎంతో కష్టం. నిత్యజీవితానికీ, నిజ జీవితానికి సమన్వయం అవసరం.(నిజ జీవితమంటే తానే "నిజం"గా జీవించడం). అట్టి సమన్వయాన్ని అందిస్తాయి వివిధ సాధనా మార్గాలు. వివరణలు ఎన్ని ఉన్నాయో, వాటిని అనుష్టించే మార్గాలూ అన్ని ఉన్నాయి. కానీ వాటిలో ఎక్కువ శాతం విధానాలు విధించే జీవిత విధానం సామాన్యునికి రుచించటం కష్టం. వాటిలో ఒకటి ఎక్కువ ఒకటి తక్కువ అనటం కన్నా ప్రతి వ్యక్తికీ వ్యక్తిగతంగా ఏది సమంజసమో చూసుకోవటం ముఖ్యం.

ప్రతి వ్యక్తి, పక్కన వారికంటే ఎంతో వేరుగా ఉన్నట్లనిపించినా సమాజం మొత్తంగా చూస్తే వివిధ వ్యక్తుల మధ్య అంత వైవిధ్యం లేదని తెలుస్తుంది. ఒకే మానసిక సామగ్రి, దాదాపు ఒకే రకమైన శరీరాలు, ఒకే రకమైన అభినివేశాలు, భావోద్రేకాలు మానవజాతి అంతటిలో కనిపిస్తాయి.

దేశ-కాల పరిస్థితుల దృష్ట్యా అవి వ్యక్తమయ్యే విధానం మారవచ్చు. అంటే అందంగా ఉండాలనే కోరిక అన్ని దేశకాలాలలో వున్నా fashionలు మారినట్లు, అలానే దేశకాల పరిస్థితుల దృష్ట్యా వివిధ వర్ణనలు ప్రజా బాహుళ్యాన్ని ఆకర్షించవచ్చు.

అయితే సిసలైన మహాత్ములలో ఈ వర్ణనలన్నీ సామరస్యాన్ని చెందుతాయి. అన్నీ సమన్వయపడి ఉంటాయి. వాటి మధ్య పైకి కనిపించే భేదాలు వాటి హృదయంలో దాగివున్న ఏకత్వంగా అట్టి సద్గురుమూర్తులను చూపిస్తాయి. అట్టి మహనీయుల జీవితాలు వివిధ మార్గాల మధ్య సామరస్యాన్ని చేకూర్చటానికవసరం. విశ్వానికి ఆధారంగా ఏ చైతన్యమైతే ఉన్నదో అదే

తానైనప్పటికీ సద్గురువు ఆ పరతత్త్వాన్ని తిరిగి భక్తులకవసరమైన రీతిన వర్ణిస్తాడు.

అలాంటి సమన్వయాన్ని కనబరుస్తూ, వివిధ వర్ణనలను, అవి నిర్దేశించే "నిజ జీవితాన్ని" నిత్యజీవితానికి సమన్వయం చేసి చూపిన మహనీయ మూర్తులలో శ్రీ రామకృష్ణ పరమహంస వొకరు. వీరి పేరు విననివారు భారతావనిలో ఉండరంటే అతిశయోక్తికాదు. శ్రీ రామకృష్ణులు, వారి శిష్యులైన శ్రీ వివేకానందస్వామి పేర్లు తెలియని వారుండరు. అయినా వారి జీవిత విశేషాలు, బోధలు ఎందరికో తెలియవు.

శ్రీ రామకృష్ణ పరమహంస బాల్య నామం "గదాధరుడు". పుణ్యదంపతులు శ్రీ ఖుదీరామ్ ఛటోపాధ్యాయ- చంద్రమణీ దేవీ దంపతులకు "కామార్పుకూర్" అనే పల్లెలో జన్మించారు గదాధరులు. వీరి బాల్యం ఎంతో విలక్షణంగా గడిచింది. సుకుమార సౌందర్యంతో భాసించే గదాధరులు తన ఆరవ యేట ఒక దివ్యానుభూతిని పొందారు. ఒకరోజు పొలంవెంట నడుస్తున్నారు గదాధరులు. ఆకాశంలో వర్షపునీలిమబ్బులు కమ్మి ఉన్నాయి. అలా నడుస్తున్న 6 ఏళ్ళ గదాధరునికి ఒక కొంగలబారు ఆకాశంలో ఎగురుతూ కనిపించింది. నీలిమబ్బుల ఆకాశం కృష్ణునిలా కొంగలబారు కృష్ణుని కంఠాభరణంగా దర్శనమయ్యింది. వెంటనే ఆనంద పారవశ్యం కలిగి బాహ్యస్మృతి మనస్సును వీడి, మనస్సు ఆనందానుభూతిలో లయించింది. ఇలానే గదాధరులకు ఎన్నో దివ్యానుభూతులు కలుగుతుండేవి. విశాలాక్షీ దేవికి అర్చన చేస్తున్నప్పుడు తరచూ వారు ఆనందంలో మునిగి బాహ్యస్మృతి కోల్పోయేవారు. అలానే ఒక శివరాత్రికి ఒక నాటకంలో శివుని పాత్ర ధరించిన గదాధరులకు అట్టి ఆనందపారవశ్యమే కలిగింది. 10 సం॥లు వయస్సు వొచ్చేసరికి గదాధరులకు అట్టి అనుభూతులు మరింత తరచుగా కలుగుతుండేవి. 12 సం॥ల వయస్సుదాకా అందరిలాగే బడికి వెళ్ళి చదువుకున్న గదాధరులు "ఈ పొట్టకూటి చదువులు నాకక్ఖర్లేదు" అంటూ బడి మానివేశారు. ఎక్కువసమయం సాధుసత్పురుషులు-సన్యాసుల సాంగత్యంలో గడిపి చిన్న వయస్సులోనే రామాయణ, భాగవత భారతాలను, ఇంకెన్నో పురాణాలను నేర్చారు. 1843 లో తండ్రిగారు మరణించినప్పటినుండీ ఇంటిపనులలో అన్నయ్య రామకుమార్‌గారికి సహాయ పడుతూ దేవతార్చనలో కాలం గడిపేవారు గదాధరులు. రామ్‌కుమార్‌గారు ఒక సంస్కృత పాఠశాలను స్థాపించి అందులో పాఠ్యాంశాలు నేర్పుతూ అర్చకత్వంకూడా చేసేవారు. 1852లో అన్నయ్యకు అర్చకత్వంలో సహకరించడానికి కలకత్తా చేరుకున్నారు గదాధరులు.

1855లో దక్షిణేశ్వరంలోని కాళికాదేవి ఆలయంలో అర్చకవృత్తి రామ్‌కుమార్‌గారికి అప్పగించబడింది. రామ్‌కుమార్‌గారికి సహకరించడానికి మేనల్లుడు హృదయ్‌తో కలిసి దక్షిణేశ్వరానికి వచ్చారు గదాధరులు. ఆ మందిరం నిర్మించిన రాణి రాస్‌మణీ అనబడే శ్రీమంతురాలు తరచు జపధ్యానాలు చేసుకుంటుండేవారు. వీరి అల్లుడు మధురబాబు కాలాంతరంలో గదాధరుని "రామకృష్ణ" అని పిలవటం మొదలుపెట్టారు.

అన్న రామ్‌కుమార్‌గారు పరమపదించినప్పటినుండీ రామకృష్ణులు క్రమంగా నిర్లిప్తులౌతూ ఎప్పుడూ ఏదో చింతనలో నిమగ్నులై వుండేవారు. 1856లో రామ్‌కుమార్ గారి తదనంతరం శ్రీ రామకృష్ణులే అర్చకత్వ బాధ్యతలు నిర్వహించేవారు. వారికి రోజురోజుకీ కాళికామ్మవారి దర్శనంకోసం తపన పెరగసాగింది. అమ్మ దర్శనం కావాలనే వారి తపన ఎంతటిదంటే వారు అమ్మను అర్చించేటప్పుడు తరచు పెద్దగా విలపిస్తూ దర్శనమివ్వమని ఆమెని వేడుకుంటుండేవారు. అలాంటి సమయంలో వారిని ఓదార్చడంకూడా సాధ్యమయ్యేది కాదు. వారికి మందిరంలోని అమ్మ విగ్రహం సాక్షాత్తూ అమ్మ స్వరూపం. ఆ విగ్రహానికి ఎంతో శ్రద్ధతో అర్చన నైవేద్యాదులు నిర్వహిస్తున్న రామకృష్ణులకు ఎవరైనా నిర్లక్షంచేస్తే ఎంతో బాధ కలిగి కోపంకూడా కలిగేది. అందుకని మరింత శ్రద్ధతో, జాగ్రత్తతో అన్ని ఉపచారాలు తామే చూసుకునేవారు. కాలక్రమేణ వారి ప్రభావం వలన తక్కిన వారందరికీ అట్టి భక్తి శ్రద్ధలు ఏర్పడ్డాయి.

చివరకు ఒకసారి రామకృష్ణులకు అమ్మ దర్శనం కోసం తపన

తారాస్థాయికి చేరుకుంది. అమ్మ దర్శనం లేని జీవితం వ్యర్థమని తోచి ఆత్మాహుతికి సిద్ధపడ్డారు గదాధరులు. అంతటి తపన కలిగింది కాబోలు, అమ్మ హృదయం కరిగింది. రామకృష్ణులకు సర్వవ్యాపకం అయిన అమ్మ విశ్వరూప దర్శనం కలిగింది.

"ఇళ్ళు, వాకిళ్ళు, మందిరాలు మొదలైనవన్నీ అదృశ్యమయ్యాయి. ఎటుచూసినా అంతులేని ఆనంద సముద్రం గోచరమైంది. అన్ని దిక్కులలోనించి ఆనందకాంతి తరంగాలు నన్ను సోకుతున్నట్లు దర్శనమయింది." అని ఆ అనుభవాన్ని వివరించారు శ్రీ రామకృష్ణులు.

కానీ వారిలో ఇంతటి అద్భుత ఆధ్యాత్మిక స్థితి మేలుకొన్నదన్న విషయం మూఢులైన జనసామాన్యానికి అర్థం కాలేదు. రామకృష్ణులకు మతి స్థిమితం తగ్గిందని, వివాహం చేస్తే ఈ పూజలు మొదలైనవి తగ్గి స్థిమితమొస్తుందనీ తలచిన బంధువులు రామకృష్ణులను ఒప్పించడానికి ప్రయత్నించారు. మొదట అంగీకరించని రామకృష్ణులు చివరకు జయరాంబాటీలో రామచంద్రముఖర్జి గారున్నారనీ, వారి కుమార్తె "శారదామణి ముఖోపాధ్యాయ"ను తను వివాహం చేసుకుంటాననీ చెప్పారు. పెద్దల సమక్షంలో అట్టి అద్భుత దంపతులకు వివాహం జరిగింది. వివాహానంతరం అందరూ ఊహించినట్లు లౌకికంలో పడక శ్రీ రామకృష్ణులు తమ ఆధ్యాత్మిక సాధనలను మరింత విస్తృతంగా చేయనారంభించారు. శారదామాత సైతం రామకృష్ణులు నిర్దేశించిన రీతిన ఎన్నో సాధనలు చేయనారంభించారు.

కాళీపూజలో నిమగ్నమైన రామకృష్ణులకు ఒక చిన్న రాముని విగ్రహం లభించింది. వారు శ్రీ రాముని పట్ల దాస్యభావాన్ని వహించి సేవించేవారు. ఆ విగ్రహం కేవలం ప్రతిమగాకాక శ్రీ రామునిగా రామకృష్ణులకు గోచరించేది. వారవలంబించిన "దాస్యభావం" భక్తిమార్గ పరిభాషలో హనుమంతుని భక్తికి వర్ణన. ఇదే భావాన్ని క్రైస్తవంలో ఎందరో మహనీయులు కలిగియుండటం వారి చరిత్రలలో చూడవచ్చు. ఇట్టి భావంలో తాదాత్మ్యం చెందిన రామకృష్ణులు నిజంగా శ్రీ రాముని దాసునిలా ప్రవర్తించేవారు.

అలాంటి సమయంలో రామకృష్ణులకు "ఝుటాధరి" అనే వైష్ణవ సాధువు "వాత్సల్య భావం" అవలంబింపజేసారు. అప్పటినుండీ రామకృష్ణులు శ్రీరాముని చిన్న బాలునిగా భావించి తల్లికి ఉండే వాత్సల్యంతో సేవించేవారు. ఆ శ్రీరామ విగ్రహాన్ని ఎంతో ముద్దుగా "రామలాలా" అని పిలుస్తూ ఎంతో ప్రేమతో చిన్న పిల్లవానికి చేసినట్లు అన్ని పరిచర్యలు చేసేవారు రామకృష్ణులు. ఆ విగ్రహం రూపంలో శ్రీ రాముడే బాలునిగా దర్శనమిచ్చేవారు శ్రీరామకృష్ణులకు. ఇదే వాత్సల్య భావం భాగవతోత్తములెందరో ధరించి తరించినట్లు భాగవతం మొదలైన గ్రంథాలలో చూడవచ్చు. వారందరూ ఎట్టి స్థితిని పొందారో అట్టి ఉత్తమ స్థితి శ్రీరామకృష్ణులకు సహజమైనది.

అటు తరువాత శ్రీ రామకృష్ణులు శ్రీ కృష్ణుని "మధుర భావం" తో సేవించనారంభించారు. ఇది శ్రీ కృష్ణుని పట్ల గోపికలకున్న భావంగా, రాధకున్న భావంగా వర్ణించబడింది. భావపారవశ్యంలో రామకృష్ణులు సైతం తరచు స్త్రీ వేషం ధరించి కృష్ణునితో విహరించిన గోపికలతో తాదాత్మ్యం చెందేవారు. ఇట్టి సాధనకు పర్యవసానంగా శ్రీ రామకృష్ణులకు "సవికల్ప సమాధి" అనుభవం కలిగి కృష్ణునితో ఐక్యమైనట్లనుభవం కలిగింది. ఇలా శ్రీరాముని, శ్రీ కృష్ణుని సేవించేవారు కాబట్టి వారికి "రామకృష్ణ" అనే పేరు నిలిచిపోయింది.

నిత్యానందులకు, చైతన్యమహాప్రభువుకూ స్వస్థానమైన 'నదియ'ను దర్శించారు రామకృష్ణులు. ఇద్దరు దివ్య తేజో మూర్తులైన బాలురు తనలో లీనమైనట్లు అనుభవం కలిగి రామకృష్ణులకు పారవశ్యం కలిగింది.

సామాన్యంగా ఈ భక్తి భావాలలో ఏదో ఒక భావాన్ని అనుష్టించి నిలపటమే ఎంతో కష్టమైన విషయం. ఎక్కువమందికి ఒక జీవితకాలంలో ఇది సాధ్యపడని విషయం. అలాంటిది ఒక దాని తరవాత ఒకటిగా ఇన్ని భావాలను సహజంచేసుకుని వాటిలో పరాకాష్ఠను సాధించడం శ్రీ రామకృష్ణులకే చెల్లింది. వీటన్నిటి ద్వారా ఒకే చరమానుభవాన్ని వారు పొందటం

వివిధ ఆధ్యాత్మిక మార్గాలు, వర్ణనల లక్ష్యం ఒక్కటేనన్న సత్యానికి నిలువెత్తు నిరూపణ. ఇన్ని భక్తి భావాలనూ నిరూపించిన రామకృష్ణులు వైష్ణవసాంప్రదాయానికి మాత్రమే పరిమితులు కాలేదు.

ఇట్టి భావాలు పొందకమునుపే వారికి మతిభ్రమించిందనే చిత్తభ్రమలో ప్రజలున్న రోజులలో "భైరవి బ్రాహ్మణి" అనే ఉత్తమ సన్యాసిని దక్షిణేశ్వరానికి వచ్చింది. ఆమె పండితులను సమావేశపరచి పురాణ, ఇతిహాస, శాస్త్ర ప్రమాణాలతో శ్రీ రామకృష్ణుని నిజస్థితిని నిరూపించి వారికి మతిచలించటం కాదని, ఆయన స్థితి పరమహంస స్థితి అని ఋజువుచేసి అందరికీ తెలియపరిచింది. ఆమె శ్రీ రామకృష్ణులను సొంతకొడుకువలే చూచేది. ఆయనను ఒక అవతారమూర్తిగా గౌరవించేది. శ్రీ రామకృష్ణులు ఆమెతో సొంత తల్లివలే ప్రవర్తించేవారు. భైరవి బ్రాహ్మణి తంత్రశాస్త్ర ప్రవీణురాలు. ఆమె వద్ద శ్రీ రామకృష్ణులు తంత్రాధ్యయనం చేశారు. తంత్రానికి సంబంధించిన 64 సాధనలను అలవోకగా పూర్తిచేసి సిద్ధి గడించారు. అప్పట్లో వారు కాళికామాతపై శాంతభావాన్ని కల్గి వుండేవారు.

కేవలం హైందవ సాంప్రదాయానికి మాత్రమే శ్రీ రామకృష్ణులు పరిమితం కాలేదు. 1866లో గోవిందరాయ్ అనే సూఫీ సాధువు వద్ద ఇస్లాంను అభ్యసించారు రామకృష్ణులు. "నేను భక్తి శ్రద్ధలతో అల్లా నామాన్ని నిరంతరం స్మరించేవాడిని. ముసల్మాన్ వలే దుస్తులు ధరించి, రోజూ ఐదుసార్లు ప్రార్ధన చేసేవాడిని. అప్పట్లో హిందూ దేవతా స్మరణ రుచించక వారి పటాలు సైతం చూచేవాణ్ణికాదు. కాళీమందిరానికి కూడా వేళ్ళే వాడిని కాదు." అంటూ తన ఇస్లాం సాధన గూర్చి చెప్తారు శ్రీ రామకృష్ణులు. అలా మూడు రోజులు సాధన చేశాక వారికి దివ్యానుభవం కలిగింది. గడ్డం కలిగిన ఒక తేజోమూర్తి తనలో లీనమైనట్లనుభవం కలిగింది.

అలానే ఒకసారి 1873లో శంభూచంద్ మల్లిక్ శ్రీ రామకృష్ణులకు పవిత్ర బైబిల్ నుండి కొన్ని వాక్యాలు వినిపించారు. అవి విన్నప్పటినుండి కొన్ని రోజులపాటు తాము క్రైస్తవ పరమైన భావాలు, ఆలోచనలతో నిమగ్నులైనట్లు చెబుతారు శ్రీ రామకృష్ణులు. అలా క్రైస్తవ భక్తి భావంలో కొద్దిరోజులు గడిచిన తరువాత వారికి దివ్యానుభవం కలిగింది. ఒకరోజు 'Madonna and child jesus' (మడోనా మరియు బాలఏసు) అనే చిత్రాన్ని వారు చూడగానే ఆ చిత్రాలు సచేతనాలుగా గోచరమై ఏసు తనలో లీనమైనట్లు అనుభవం కలిగింది. వారి గదిలో ఏసు ప్రభువు చిత్రపటం ఉండేది. వారు రోజూ ఆ చిత్రపటం ముందు ఉదయసాయంత్రాలలో ధూపం వెలిగించేవారు. నీటమునుగుతున్న సైంట్ పీటర్‌ను రక్షిస్తున్న ఏసు చిత్రపటం కూడా వారి గదిలో ఉండేది.

ఇలా వివిధ ఆధ్యాత్మిక సాంప్రదాయాల సాధనా మార్గాలను తాను ఆచరించి దివ్యానుభావాలను పొందిన శ్రీ రామకృష్ణులు అవతారమూర్తి అనుటలో సందేహం లేదు. సరిగ్గా ఆచరిస్తే అన్ని సాధనా మార్గాలూ ఒకే గమ్యాన్ని చేరుస్తాయని నిరూపించిన దివ్య సమన్వయ మూర్తి శ్రీ రామకృష్ణులు.

భక్తి సాధనామార్గము, తంత్రమార్గములేకాక వేదాంత మార్గాన్ని కూడా అనుష్ఠించి అనుభవాన్ని పొందారు శ్రీ రామ కృష్ణులు. తమ సాధన పరిపూర్తి కాలేదని, నిర్వికల్ప సమాధి కలుగలేదని, అందుకు "తోతాపురి" అనే వేదాంత గురువుని ఆశ్రయించమని కాళికామాత శ్రీ రామకృష్ణులను ఆదేశించింది. దానిననుసరించి శ్రీ రామకృష్ణులు దక్షిణేశ్వరం విచ్చేసిన పరివ్రాజకాచార్యులు, దిగంబరి, అద్వైత వేదాంతి అయిన శ్రీ తోతాపురి గారిని, 1865లో ఆశ్రయించారు. తోతాపురి గారి ఆదేశంతో సర్వము బ్రహ్మమని, తానే తత్వత: ఆ బ్రహ్మయన్న వేదాంత సమన్వయ సాధనకుపక్రమించారు శ్రీ రామకృష్ణులు. కొద్ది కాలంలోనే వారికి నిర్వికల్ప సమాధి స్థితి అనుభవం కలిగింది. ఇది ఆధ్యాత్మికానుభూతులన్నింటిలో గొప్పదని ప్రతీతి. ఇంతటి స్థితిని సైతం అవలీలగా అందుకున్నారు శ్రీ రామకృష్ణులు. ఈ అనుభవం తరువాత శ్రీ రామకృష్ణులు సుమారు ఆరు మాసాలపాటు ఎక్కువ సమయం మౌనంగా నిర్వికల్ప సమాధి స్థితిలో ఉంటూ ఉండేవారు. ఆ తరువాత కాళికామాత శ్రీ

రామకృష్ణుని ఆ స్థితిలో ఉండవద్దని, వారి వలన ఎందరో ఉద్ధరింపబడాలికనుక భవముక్తునిగా ఉండమని ఆదేశించారట. మామూలు స్థితికి, సమాధి స్థితికి మధ్యనుండే స్థితికి "భవ ముక్తము" అని పేరు. ఋషులు సైతం ఈ స్థితినుండే వేదాలు పలికారని, ఈ స్థితి మధ్యస్థితి కనుక దీనినే "సంధ్యా" స్థితి అన్నారని, అట్టి వారి నుండి వెలువడిన సత్యాలు కనుక వేదాలు శక్తిమంతములని పెద్దలు చెప్తారు. ఈ రకంగా చూస్తే శ్రీ రామకృష్ణుల ప్రతిమాట వేదవాక్కన్నమాట.

అట్టి అద్భుత స్థితిలో తానున్నా కాళీకామ్మవారిపై ఎంతో భక్తిని కనబరచేవారు శ్రీ రామకృష్ణులు. అంతేకాదు. శ్రీ చైతన్య మహాప్రభువు, ఇతర మహనీయుల పట్ల ఎంతో భక్తిగౌరవాలు వారిలో ప్రకటమయ్యేవి. నిజంగా ఆధ్యాత్మిక స్థాయి పొందిన మహనీయుల వినయ సంపద ఎలా ఉంటుందో శ్రీ రామకృష్ణులను చూస్తే అర్థమవుతుంది.

వివిధ సాధనామార్గాల ప్రమాణాలలో కనిపించే వర్ణనలన్నీ ఒకే సత్యాన్ని వర్ణిస్తున్నాయి అనటానికి శ్రీ రామకృష్ణులే ఋజువు. వివిధ వర్ణనలు, భావాలు వారియందు సామరస్యం చెందాయే గానీ ప్రశ్నార్థకాలుగా మిగలలేదు. నిజంగా ఆచరిస్తే అవన్నీ ఒకే ఆధ్యాత్మిక గమ్యానికి చేరుస్తాయని, సరైన ఆచరణే ప్రధానమనీ మనం గుర్తించవచ్చు. "ఏకం సత్ విప్రా: బహుధా వదన్తి" అంటుంది కదా శృతి!

భక్తి జ్ఞాన మార్గాలేకాక ఎంతో సూక్ష్మమైన కర్మయోగం కూడా శ్రీ రామకృష్ణులలో ప్రస్ఫుటమవుతుంది. మతాల, సాధనా మార్గాల పర్యవసానము, లక్ష్యము ఒక్కటేనని వారిని చూస్తే ఋజువవుతుంది. అట్టివారి స్థితి భగవంతుని ఆస్తిక్యాన్ని నిరూపిస్తుంది. వారి బోధ మార్గాన్ని చూపుతుంది. జాగ్రత్తగా గమనిస్తే నిజంగా ఆధ్యాత్మిక జీవితానికి, సాఫల్యానికీ ఏది అవసరమోనన్నది వారిలో దర్శనమిస్తుంది. "మధులుబ్ధో యధా బృంగః....." అనే శ్లోకం వారిలో పరిపూర్తిని చెందుతుంది. అంతటి స్థితిని సహజం చేసుకున్న వారు సైతం తమ సర్వవ్యాపకమైన పరతత్వాన్ని 'అమ్మ'గా గౌరవించడం చూస్తే, నిజమైన మహనీయుని వినయాన్ని చూపుతుంది. సర్వాంతర్యామి, పరంధాముడు అయిన శ్రీ సాయినాథులు సైతం "అల్లామాలిక్" అని ఉచ్ఛరించేవారు. ఆధ్యాత్మిక సౌరభాన్ని అధిరోహించి అత్యున్నత స్థితిలో నిలచిన భరద్వాజ మహరాజ్ కూడా ఆ పరతత్వాన్ని తమ గురువైన సాయినాథునిగా వ్యవహరించటం చూడవచ్చు.

నీటితోకలిసిన పాలనుండి పాలను వేరుచేసి హంస స్వీకరించినట్టు పరమహంస సత్యాన్ని దర్శిస్తాడని ఆర్యోక్తి. అట్టివానికి అందుకే "పరమహంస" అనేది సార్థకం. మనవలెనే మానవాకృతితో మనమధ్య నడచి, మన మధ్యే జీవించి ఈ అనంత విశ్వమంతా వ్యాపించి వున్న సత్యాన్ని సాధించిన శ్రీ రామకృష్ణులు పూజ్యులైన "పరమహంస". అట్టి పరమహంస అందరినీ అనుగ్రహించుగాక!!

అధ్యాత్మిక జీవన సమన్వయాన్ని అందించే ఇట్టి మహనీయులందరూ గాఢాంధకారంలో కొట్టుమిట్టాడుతున్న మనకు, నేటి సమాజానికీ ఆశాదీపాలు. అదర్శమూర్తులు. అభ్యుదయ ప్రతీకలు. సకలజీవశ్రేయోకారుడైన దత్తాత్రేయుని స్వరూపాలు. వీరందరి చరిత్రలు మనందరికీ అద్భుత బోధలు. "ఈ ప్రపంచమందుండు మహనీయులందరూ నా జ్ఞప్తియందుండి సరియైన మార్గమును తృటి అయిననూ మరువనీయకుందురుగాక!!" "మహాత్ములు నడచి చూపిన శుభప్రదము, జ్ఞాన శక్తి యుక్తము, జరామరణ రహితము అగు శ్రేయో మార్గము నాకు దక్కుగాక" అనే ఉదయ ప్రార్థనా వాక్యాలే మనందరికీ మార్గదర్శకాలుగా నిలవాలని అట్టి మహనీయ మూర్తులకు ప్రార్థన.

# శ్రీ దత్తలీలామృతము

## (శ్రీ దత్తాత్రేయస్వామి చరిత్ర)

జనవరి సంచిక తరువాయి

- శ్రీమతి శ్రీదేవి

ఈ విధంగా స్తోత్రము గావించి, స్వామికి సాష్టాంగ నమస్కారములొనరించాడు అలర్కమహారాజు. "తండ్రీ! ఆ తర్వాత అతడు స్వామి నుండి శెలవు తీసుకొని నేరుగా కాశీరాజు సుబాహువుల వద్దకు వెళ్లాడు." అని సుమతి తన తండ్రికి చెప్పాడని వేద ధర్ముడు దీపకునికి తెలియజేశాడు. వేద ధర్ముడు దీపకునితో యింకా యిలా అన్నాడు. "దీపకా! సుమతి చెప్పిన అలర్కవృత్తాంతమును విన్న తండ్రికి ఒక సందేహం పొడ చూపింది. అతడు కుమారుణ్ని యిలా ప్రశ్నించాడు. "కుమారా! కథ ఎంతో చిత్రంగా వున్నది. దత్తానుగ్రహమును పొందిన అలర్కమహారాజు దత్తస్వామినుండి సెలవు గైకొని తర్వాత తన కుటుంబమును గానీ, హితోభిలాషులను గాని కలుసుకొన యత్నింపక శతృభావముతో నుండిన కాశీరాజును, సుబాహువును కలుసుకొనిన కారణమేమై వుంటుంది?". ఆ ప్రశ్న విన్న కుమారుడు నవ్వి, "తండ్రీ! శ్రీదత్తస్వామి అనుగ్రహం పొందిన అలర్కునిలో యీ ప్రపంచం పట్ల భేద భావం నశించింది. ఇక యిప్పుడు అతనికి మితృడెవరు? శతృవెవరు? అతని దృష్టిలో యిద్దరూ సమానులే." అనిచెప్పి, తదుపరి కథను యిలా కొనసాగించాడు. "కాశీరాజు, సుబాహువులను కలిసి, అలర్కుడు వారిరువురికీ సాష్టాంగ నమస్కారాలాచరించాడు. కాశీరాజుకు చేతులు జోడించి నమస్కరిస్తూ యిలా అన్నాడు. "కాశీరాజా! నీకు నా హృదయపూర్వక నమస్కారాలు. నాకు రాజ్యకాంక్ష నశించింది. కనుక నీవు జయించిన నా రాజ్యమును శాశ్వతంగా నీవే ఏలుకో. లేకుంటే అన్నగారికివ్వు. నీ యిష్ట ప్రకారము నిర్ణయం తీసుకోవచ్చు". అది విన్న కాశీరాజు "ఓ రాజా!! నీ మాటలు వింతగా వున్నాయి. నీ రాజ్యమును నీవు తిరిగి పొందే ప్రయత్నం చేయకుండా శతృవుతో యీ విధంగా మాట్లాడటం క్షత్రియ ధర్మంకాదని నీవెరుగవా? ధైర్యముతో తగు సైన్యాన్ని సమకూర్చుకొని యుద్ధము చేసి నీరాజ్యమును నీవు తిరిగి స్వాధీనపరచుకొనే ప్రయత్నంచేయాలి. నీతి, న్యాయములతో రాజ్యపాలన చేస్తూ, యజ్ఞయాగాదికములు, దానధర్మాలు నిర్వర్తిస్తూ క్షత్రియ ధర్మాన్ని నిలబెట్టాలి. కానీ నీ ఆలోచన యిందుకు విరుద్ధంగా తోస్తున్నది. అన్నీ తెలిసినవాడవు. ఈ విధంగా ప్రవర్తిస్తున్న కారణమేమిటి?" అని ప్రశ్నించాడు. అలర్కుడిలా అన్నాడు. "కాశీరాజా! మొదట నేనుకూడా యీ విధంగానే భావించాను. కానీ, నీవు యుద్ధము చేసి నా రాజ్యము నాక్రమించిన సమయంలో ఎన్నడూ ఓటమి నెరుగని నేను తీవ్ర మనోవేదన చెంది శ్రీ దత్తాత్రేయుని శరణు వేడాను. దయాళువైన ఆ స్వామి నన్ననుగ్రహించి, నాకు జ్ఞాన భిక్ష పెట్టారు. నా దుఃఖాన్ని సమూలంగా తొలగించారు. ఇప్పుడు నాకు సకల ప్రపంచము ఆత్మస్వరూపముగానే కన్పిస్తున్నది. ప్రాపంచిక బాంధవ్యాల నన్నింటినీ విడిచిపెట్టి, ఏకాంతంలో మనస్సును ఏకాగ్రపరచి, నిరంతర ధ్యాననిష్టలో నిలచి, ముక్తిని సాధించాలని నిర్ణయించుకొన్నాను. నా జీవితం యింత అద్భుతమైన మలుపు తిరగటానికి కారకుడవైన నీవు నాకు శతృవువు కానే కావు. నీకు నా ధన్యవాదాలు".

తమ్ముని మాటలు వింటున్న సుబాహువు మనస్సు ఆనందంతో

ఉప్పొంగిపోయింది. అతడు తన ఆసనం నుండీ దిగ్గున లేచి వచ్చి, తమ్ముడని గాఢంగా కౌగిలించుకొని, "తమ్ముడా, అలర్కా! ధన్యుడివి. ఇంతకాలానికి సన్మార్గంలోనికి వచ్చావు. చాలా సంతోషం" అని పలికి, కాశీరాజుతో "మిత్రమా! నీకు నా ధన్యవాదాలు, నేను వచ్చిన పని నెరవేరింది. నేను సంకల్పించిన కార్యం సఫలమైంది, ఇక నేను వెళ్లి వస్తాను. శెలవు" అన్నాడు.

ఈ సన్నివేశాన్నంతా విస్తుపోయి చూస్తున్న కాశీరాజు సుబాహువుతో, "అయ్యా! మీ అన్నదమ్ముల మాటలు, చర్యలే వింతగా తోస్తున్నాయి. కొంతకాలం క్రిందట మీరు నావద్దకు వచ్చి మీరాజ్యమును మీ తమ్ముడు అపహరించాడనీ, తిరిగి మీ రాజ్యభాగాన్ని మీకిప్పించవలసిందనీ వేడుకొన్నారు. మీ కోర్కె మేరకు అలర్కునిపై దండెత్తి అతని రాజ్యమంతటినీ స్వాధీనపరచుకొన్నాను, ఆరాజ్యానికి మీరే పట్టాభిషిక్తులై ఏలుకొనండి. అలా చేయక, 'నేను వచ్చిన పని సఫలమైంది. వెళ్లిపోతాను.' అని అంటున్నారు. ఇదేమి చిత్రం? ఎక్కడికి వెళ్లిపోదలచారు?" అని ప్రశ్నించాడు.

సుబాహువు మహర్షి నవ్వుతూ యిలా బదులిచ్చాడు – "మిత్రమా! నన్ను క్షమించు. నేను వచ్చిన పని ఏమిటో అది ఎలా సఫలమైందో వివరంగా చెబుతాను, విను – మా తల్లి మదాలస శివుని వరప్రసాదంగా జన్మించింది. ఆమె జన్మతః యోగినిగా, యోగమాతగా జన్మించింది. ఆమెకు నేను, విక్రాంతుడు, శత్రుమర్దనుడు, అలర్కుడు అను నలుగురు పుత్రులము జన్మించాము. మొదటి ముగ్గురికి మాతల్లి స్తన్యము నోటితోను, జ్ఞానబోధ చెవులతోను త్రావించుతూ పెంచింది. అందువలన మేము ముగ్గురము చిన్న వయస్సులోనే విరాగులమై ముక్తి సాధనకై యిల్లు విడచి అడవులకేగి తపస్సులో నిమగ్నులమైనాము. ఇక నాల్గవ కుమారుడైన అలర్కునికి మాతల్లి భర్త ఆజ్ఞ ప్రకారము క్రమముక్తి మార్గమును బోధించింది. అందువలన అలర్కుడు కర్మలంపటుడై, సంసార బంధములలో పడి కొట్టుకొనుచు, వైరాగ్యహీనుడై, ముక్తికాంక్షలేనివాడై జీవిస్తుండటం గమనించిన నేను ఎంతో ఆవేదన చెందాను. నలుగురు స్నేహితులము కలసి జీవిస్తున్నపుడు అందులో ఒకడికి ఏదైనా ఆపద సంభవించనపుడు మిగిలిన వారు చూస్తూ ఊరుకోగలరా? అదే విధంగా రక్త సంబంధం కలిగిన మా స్వంత తమ్ముడు చెడిపోతుంటే అతనిని సన్మార్గములో పెట్టవలసిన బాధ్యత మా సోదరులదే కదా! 'యోగిని అయిన మాతల్లి మదాలస చనుబాలు త్రావి పెరిగిన మా తమ్ముడు యితర కాంతల బిడ్డలవలే వ్యర్థమైన జీవితము గడిపి పోవలసినదేనా' అనే బాధతో అతనిని ఏదో విధముగా మంచి మార్గములోకి మరల్చాలన్న ఆలోచన నాకు కలిగింది. సుఖలంపటుడైన మా తమ్ముడు మారాలంటే ఒక్కటే మార్గం నాకు స్ఫురించింది. తీవ్రమైన కష్టమేదైనా జీవితంలో సంభవిస్తేనే మనిషిలో దైవచింతన మేల్కొంటుందన్న ఆలోచనతో నేను మీ వద్దకు వచ్చి, అలర్కునిపై లేని నిందలు మోపి మిమ్మల్ని అతనిపైకి యుద్ధానికి ప్రేరేపించాను. దైవానుగ్రహంతో నేననుకొన్నట్లుగానే మావాడు యుద్ధంలో పరాజయంపాలై తీవ్రవేదనతో విరక్తుడై శ్రీదత్తాత్రేయ స్వామినాశ్రయించాడు. ఆ స్వామి దయతో ముక్తిమార్గంవైపు ప్రేరేపింపబడ్డాడు. ఈ విధంగా నేననుకొన్న కార్యం నెరవేరింది. నా ప్రయత్నం ఫలించింది. సన్యాసినైన నాకు రాజ్యమెందుకు? మీవలన మా తమ్ముడు బాగుపడ్డాడు. నాకదే చాలు."

సుబాహువు మహర్షి చెప్పినదంతా విన్న కాశీరాజు ఎంతో సంతోషించాడు. యోగమార్గరతులైన ఆ యిరువురు అన్నదమ్ములకు భక్తిప్రపత్తులతో నమస్కరించి, సుబాహువుమహర్షితో యిలా అన్నాడు, "ఓ మహాత్మా! మీదర్శనంతో నా జన్మ ధన్యమైంది. మీరు మీ సోదరుని

నిమిత్తము కార్యార్థియై నా వద్దకు రావటం నా అదృష్టం. ఇంతకాలం మీకు మారాజ్యంలో ఆశ్రయం యివ్వటం మా జన్మ జన్మల పుణ్య ఫలం. స్వామీ! నాదొక మనవి. మీరు మీ తమ్మునికి మంచి మార్గం చూపారు కానీ, అజ్ఞానాంధకారంలో మునిగివున్న నాకు ఏదారీ చూపించకనే మీదారిని మీరు వెళ్లిపోతామంటున్నారు. ఇది మీకు న్యాయమేనా? నాపై దయ చూపి నాకూ యింత జ్ఞానభిక్ష పెట్టి నన్నుద్ధరించవలసిందిగా వేడుకొంటున్నాను."

సుబాహువు నవ్వుతూ "కాశీశ్వరా! నీవు నాకు, నా తమ్ముడికి మహోపకారమొనర్చిన పుణ్యాత్ముడివి. నీ పుణ్యము నిన్నుద్ధరించకపోతుందా? రాజా! ధర్మము, అర్థము, కామము అను మూడు పురుషార్థములను నువ్వు యిదివరకే సాధించావు. ఇక నాల్గవది అయిన మోక్షమొక్కటే నీవు సాధించవలసి వున్నది. ఆ మోక్ష మార్గమును గురించి నీకు వివరిస్తాను. శ్రద్ధతో ఆలకించు" అంటూ కాశీరాజుకు ముక్తి సాధన ఎలా చేయాలో చెప్పసాగాడు.

"కాశీరాజా! జాగ్రత్తగా గమనించు. మాయలో చిక్కిన ప్రతివాడు "నేను-నాది" అన్న భావనతో కప్పబడి వుంటాడు. తను చేసే ప్రతిపనికీ తానే కర్తననీ, తన వలననే సమస్తము జరుగుతున్నదనీ భావిస్తుంటాడు. అయితే సమస్త సృష్టికి కర్త, భర్త, సంహారకర్త పరమేశ్వరుడేనన్న విషయాన్ని పూర్తిగా మరచిపోవటం వలననే మానవుని జీవితం అనేక అనర్థాలకు లోనవుతున్నది. కనుక ముక్తి కావాలనుకొనేవాడు మొట్టమొదటగా యీ భ్రమ నుండీ బయటపడే ప్రయత్నం చేయాలి. "నేనెవడను? నాది అని అనుకొనేది ఎవరు?" అని రాత్రింబవళ్లు చింతన చేయాలి. ఈ విధంగా చింతన చేస్తుంటే అవ్యక్తము, అన్నిటికీ మూలాధారము అయిన సత్యమేదైతే వున్నదో అదే చేతనముగాను, అచేతనముగాను కూడా అయివున్నదని నీకు తెలుస్తుంది. సమస్తమైన భౌతిక పదార్థాలన్నీ అచేతనమునుండే ఏర్పడ్డాయని కూడా నీకు అర్థమౌతుంది. ఈ విషయమొక్కటీ తెలిసికొన్నట్లయితే సర్వమూ నీకు తెలిసినట్లే."

"రాజా! అవ్యక్తం కారణమైతే వ్యక్తము కార్యము, శబ్దస్పర్శ, రూప రసగంధములు, భూమి, ఆకాశము, గాలి, నిప్పు, నీరు అను పంచభూతములు, జ్ఞానేంద్రియ, కర్మేంద్రియములు, మనస్సు, వీటిని వ్యక్తమనిగానీ, కార్యమనిగానీ అంటారు. అయితే యీ కార్యకారణములను తెలిసికొనేవాడెవడు? అని నిరంతరము యోచన చేస్తుండాలి. అహంకార, మమకారములను తొలగించుకొని 'నేనెవడను?' అని రాత్రింబవళ్లు చింతన చేయగా చేయగా ఏదో ఒకనాటికి నీకు సత్య పదార్థం గోచరిస్తుంది. అదియే ఆత్మసాక్షాత్కారం. అదే ముక్తి. అయితే యీ ముక్తిని సాధించాలంటే ఎనలేని సాధన అవసరం. అంతేకాదు, భగవదనుగ్రహం, గురుకృప కూడా తోడైనప్పుడే ముక్తిని సాధించగలం."

"కాశీరాజా! విన్నావుగా! నీవుకోరినట్లు పరమార్థసాధనా మార్గాన్ని వివరించాను. పట్టుదలతో సాధన చేసి ముక్తిని సాధించగలవని ఆశిస్తున్నాను. నీకు శుభమనుగుగాక! ఇక నేను వెళ్లి వస్తాను." అన్నాడు సుబాహువు. కాశీరాజు ఎంతో సంతోషించి అలర్కసుబాహువుల భక్తితో పూజించి, నమస్కరించి, వారికి వీడ్కోలు పలికాడు", అని వేదధర్ముడు దీపకునికి చెప్పాడు. "గురుదేవా! శ్రీ దత్తస్వామి కరుణా కటాక్ష వీక్షణములచే అంతటి ఆధ్యాత్మిక స్థితిని అలర్కుడు పొందగలిగాడంటే ఆ స్వామి ఎంతటి దయామయుడో తెలుస్తున్నది. ఆ తర్వాత అలర్కుడేమి చేశాడు? అతని రాజ్యం ఏమయింది?" అని దీపకుడు అడుగగా వేదధర్ముడీవిధంగా బదులిచ్చాడు.

- సశేషం

మరాఠీ మూలం: శ్రీ హేమాడ్పంతు

స్వేచ్ఛానువాదం: పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

# శ్రీ సాయి సచ్చరిత్ర

జనవరి సంచిక తరువాయి

## అధ్యాయము - 49

శ్రీ గణేశాయ నమః, శ్రీ సరస్వత్యై నమః, శ్రీ గురుభ్యోన్నమః,
శ్రీ కులదేవతాయై నమః శ్రీ సీతారామ చంద్రాభ్యాం నమః
శ్రీ సద్గురు సాయినాథాయ నమః.

సద్గురువును సాంగోపాంగంగా స్తుతించలేక వేదాలు, పురాణాలు గూడ అలిసిపోయాయి. అటువంటప్పుడు అజ్ఞానినైన నేను, ఆయన గుణగణాలను ఏమని వర్ణించగలను?(1). కనుక మౌనంగా వుండడమే ఉత్తమము. కానీ సాయిలీలలు ఒకొక్కటీ మౌనాన్ని మరిపింపజేస్తాయి(2). శ్రీ సాయిబాబా లీలలు అగాధములు, ధన్యతమములు. వాటిని చూసిన నేను మౌనంగా వుండలేకపోతున్నాను. ఈ మధురమైన పక్వాన్నాన్ని రుచి చూడగానే నాకు శ్రోతలు గుర్తుకు వస్తారు(3). వారిని గూడా నా పంక్తిలో చేర్చుకోవాలని , వారు గూడా ఈ మధుర పదార్థాలను ఆరగించాలనీ నా ఆకాంక్ష అప్పుడే ఈ మాధుర్య రుచి ద్విగుణీకృతమవుతుంది(4). భోజన పదార్థాలు ఎంత మధురంగా వున్నప్పటికీ సజ్జనులు, స్నేహితులు పంక్తిలో లేకుండా ఒంటరిగా తింటే వాటిలోని మాధుర్యం చప్పబడి పోతుంది(5).

శ్రీ సాయి ఆప్తకాముడు. సకల సంతలలాముడు, భక్తులకు విశ్రాంతినొసగేవాడు. దుర్ధరమైన సంసార చక్ర భ్రమణాన్ని నివారించేవారు(6). భాషకు అందని ఆయన లీలలను వాక్కుతో వర్ణించడం సాధ్యంకాదు. తర్కానికి అందని ఆయన లీలలను గూర్చి చెప్పడానికి నేనెంతమాత్రము సమర్థుడను కాను(7). కానీ కల్యాణకరుడైన సాయి నాపై కరుణతో తమ లీలలను తామే నాకు గుర్తు చేస్తారు(8). అగాధమైన ఆయన లీలలు వర్ణించ సమర్థులెవరు? పరాశక్తే వర్ణించలేక వెనుకంజ వేసినపుడు ఇక పశ్యంతి మధ్యముల సంగతి ఎవరు చెప్పగలరు?(9). ఈ మూడూ నోరు తెరువనపుడు నాలుగవదైన వైఖరి ఏమి చేయగలదు? ఈ విషయం నాకు తెలిసినప్పటికీ నామనసు ఊరుకోవడం లేదు(10).

సద్గురువును ఆశ్రయించకపోతే ఆత్మయొక్క యథార్థ స్వరూపం తెలియదు. కనుక సద్గురువు యొక్క అనుగ్రహం పొందాలి(11). గురుచరణాలయందు భక్తి ప్రేమలను పెంపొందించుకోవడమే లక్ష్యంగా వుండాలి. సద్గురు సాంగత్యంలోని మాధుర్యము మనకనుభవం కావాలి(12). శరీరాభిమానం సంపూర్ణంగా వున్నవారు భక్తులనిపించుకోరు. నిరభిమానులకే నిజమైన భక్తి కలుగుతుంది(13). నేను జ్ఞానిని అన్న గర్వము, నేను శ్రేష్ఠుణ్ణి అన్న అభిమానము కేవలం డాంభికమే. అట్టి వారికి యింకెక్కడి ప్రతిష్ఠ?(14). తన గురువు యొక్క కీర్తిని గానం చేయని వారు అభాగ్యులు. చెవులు వున్నప్పటికీ గురువును గూర్చి వినని వారు మందమతులు(15). తీర్థ స్నానాలు, వ్రతాలు, యజ్ఞాలు, దానాదులకంటే తపస్సు శ్రేష్ఠము. తపస్సుకంటే గొప్పది హరిభజన. సద్గురు స్మరణము, ధ్యానము అన్నింటికంటే శ్రేష్ఠము(16). సాయి

భక్తులకు సాయియే ధ్యాన ధారణలు. వారి దేవదేవతార్చనలు గూడ సాయియే. సాయియే వారి గుప్తనిధి. ఈ నిధిని జాగ్రత్తగా రక్షించుకోవాలి(17). నేను బద్ధకించినప్పటికీ అంతర్యామియైన సాయి నన్ను ఒక్క క్షణం గూడ కూర్చోనివ్వడం లేదు. తమ లీలలను ఎప్పటికప్పుడు నాకు స్ఫురింపజేస్తూ, వెంటనే నేను కలం అందుకునేలాచేస్తారు(18,19). అమోఘమైన తమ లీలలను భక్తులకు తెలియజేయడానికి, నాకు పరమ శ్రేయస్సు చేకూర్చడానికీ బాబా ఈ సచ్చరిత్ర రచనకు నన్ను ప్రేరేపించారు(20).

మహాత్ముల చరిత్రలు వ్రాయడానికి ఆ మహాత్ముల యొక్క స్ఫూర్తి లేకపోతే రచన రసవత్తరంగా వుండక చప్పగా వుంటుంది. అందుకని మహాత్ములు తమ చరిత్రలను తామే రచిస్తారు అనడం సమంజసం(21). శ్రీ సాయి దయామయులు గనుక ఆయనే నా మనసులో ప్రవేశించి తమ చరిత్రను నా చేత రచింపజేసి నా మనోభీష్టాన్ని నెరవేర్చారు(22). జిహ్వతో సాయినామాన్ని స్మరిస్తూ, మనస్సులో ఆయన వచనాలను చింతన చేస్తూ, హృదయంలో ఆయన రూపాన్ని ధ్యానిస్తుంటే నాకు ఎంతో శాంతి లభిస్తుంది(23). అంతరంగంలో సాయిపై ప్రేమను నింపుకుని, నోటిలో సాయి నామస్మరణ చేస్తూ, సాయికి ప్రీతికరమైనట్లు కర్మలను చేస్తూ వుండే వారికి సాయినాథుడు ఋణపడివుంటారు(24). సంసార బంధనాలనుండి విముక్తి పొందడానికి, పరమ పావనము,సుఖదాయకము అయిన శ్రీ సాయిబాబా చరిత్ర శ్రవణంకంటే సులభమైన సాధన మరొకటిలేదు(25). చరణాలతో సాయికి ప్రదక్షిణలు చేయండి. నేత్రములతో సాయిని దర్శించండి. కర్ణములతో సాయి చరిత్ర శ్రవణము చేయండి. సర్వాంగాలతో సాయిని ప్రేమతో ఆలింగనం చేసుకోండి.(26). అష్టాంగాలతో సాయికి సాష్టాంగ నమస్కారం చేయండి. శిరస్సును సాయి పవిత్ర చరణాలపై వుంచండి. జిహ్వతో సాయి నామస్మరణ చేయండి. నాసికతో సాయి నైర్మల్యాన్ని ఆఘ్రాణించండి(27). ఇక పూర్వకథానుసంధానం చేస్తాను. క్రిందటి అధ్యాయంలో చమత్కారాల యందు ప్రీతి గల భక్తుని కథను చెప్తానని శ్రోతలకు మాట ఇచ్చాను(28). ప్రాపంచిక విషయాలకోసంగాని, పారమార్థికత కోసంగానీ, మహాత్ములనుండి ఏదైనా పొందాలన్న కోరిక లేని వారికి మహాత్ముల మహిమ తెలియదు. ఎవరైనా మహాత్ముల గురించి చెప్పినా వారికి నమ్మకం కలుగదు(29).

హరికనోబా అనేకతడు స్నేహితుడు చెప్పగా సాయిబాబా గురించి విన్నాడు. కానీ ఇతరుల దోషాలను ఎంచే స్వభావం గలవారికి మహాత్ములపట్ల విశ్వాసమెలా కలుగుతుంది? వారు స్వయంగా అనుభవిస్తే తప్ప ఏదీ నమ్మరు(30). అలాగే హరికనోబా గూడ సాయిని పరీక్షించడానికి తన స్నేహితునితో కలిసి ముంబై నుండి శిరిడీ బయలుదేరాడు(31). కానీ సాయి సర్వాంతర్యామి. సర్వజన హృదయాంతర్వర్తి. ఆయన కళాకౌశలాన్ని పూర్తిగా ఎవరు తెలుసుకోగలరు?(32). హరిభావూ శిరిడీ బయలుదేరిన కారణం బాబాకు తెలుసు. అతడు చమత్కారం చూడాలని మాత్రమే వస్తున్నాడు. అతని యోగ్యత, పాత్రత అంతమాత్రమే(33).

- సశేషం

# పరమార్థంతప్ప కోరుకోదగినది ఏదీలేదు!

అవధూత పుత్ర

జీవితంలో చెప్పుకోదగ్గ కష్టం గాని, సుఖంగానీ లేకుండా మాలిక్ దినార్ జీవితంలో అలా కొన్ని సంవత్సరాలు దొర్లిపోయాయి. ప్రతిరాత్రీ రెండు రొట్టెలు మాత్రం సంపాదించుకొని, ఒక్క పూటమాత్రమే ఉపవాసభంగం చేసుకుంటూ జీవనం చేస్తున్నాడు. ఎప్పుడైనా ఒక్కసారి మాత్రం తాజా అయిన రొట్టె దొరికేది. అపుడు ఆయన, 'భగవంతుడు ఈ రోజు నా జిహ్వా చాపల్యానికి ఎరవేసి నిరోధిస్తున్నాడు' అనుకొని, మనస్సు సంతోషించినందుకు భగవంతునికి క్షమాపణ చెప్పుకొని మరీ తినేవారు.

ఒకరోజు ఆయనకు జబ్బుచేసింది. జిహ్వకు మిఠాయి తినాలని మితిమించిన కోరిక కలిగింది. ఎలాగైనా దాన్ని నిగ్రహించాలని పదిరోజులు పాటుపడ్డా లాభం లేకపోయింది. చివరకు చేసేదిలేక, ఒక అంగడికి వెళ్ళి, మూడు మిఠాయి వుండలుకొని జోలెలో వేసుకొన్నారు. అది ఆ అంగడివాడికి వింతగాతోచి ఆయన ఏమిచేస్తారో కనిపెట్టిరమ్మని ఆయన వెనకాలే ఒక మనిషిని పంపాడు. కొద్దిసేపటికి ఆ వ్యక్తి తిరిగివచ్చి కన్నీటితో తాను చూచింది యిలా చెప్పారు: "ఇక్కడనుండి ఆయన ఒక ఏకాంత స్థలానికి వెళ్ళి, ఆ మిఠాయి వుండలను ముమ్మారు ముద్దుపెట్టుకొని యిలా అనుకున్నారు! 'ఓ మనసా – యింతకు మించిన సుఖం నీకు తగదు. బలహీనమైన ఓ నా శరీరమా, నిన్ను యిలా కష్టపెడుతున్నానని శత్రువుననుకోకు. మరణానంతరం నరకంలో నీవు శాశ్వతంగా మ్రగ్గకుండా వుండాలన్న ప్రేమవల్ల యిలా చేయవలసి వస్తున్నది. కొద్దికాలము ఓర్చుకున్నావంటె విషమమైన ఈ పరీక్షా సమయము దాటిపోతుంది. అటుపైన మీరు శాశ్వతంగా ఆనందంలో మునిగిపోతారు'. వెంటనే ఆయనలేచి అటుప్రక్కగా పోతున్న ఒక బిచ్చగాని జోలెలో ఆ మూడు వుండలు వేసి తన కుటీరానికి వెళ్ళిపోయారు.

అంగడివాడు ఆశ్చర్యముతో ఆ చూచివచ్చిన వ్యక్తి కార్చే కన్నీరుచూచి, "ఛీఛీ, ఏమిటది? కన్నీరు తుడుచుకో!" అన్నాడు.

ఆ వ్యక్తి, "ఈ కన్నీరు అంత తేలికగా ఆగేదికాదు. నన్ను చూచిరమ్మని పంపటంద్వారా నీవు నా కన్నులు తెరిపించావు. నేనూ ఆ మార్గాన్నే పోతున్నాను" అని చెప్పి తిరిగిచూడకుండా వెళ్ళిపోయాడు!

తెల్లవారింది. ఆ అంగడి తలుపులు మరెప్పుడూ తెరవబడలేదు. విచారిస్తే అతడుకూడా పరమాత్మాన్వేషి అయి వెళ్ళిపోయాడని తెలిసింది!!

నాటిరాత్రి యథాప్రకారం అంగడికి వచ్చిన మాలిక్ దినార్ జరిగిన సంగతంతా తెలుసుకొని భగవంతుని అనుగ్రహానికి విస్తుపోయాడు. జీవితంలో నవ్వుకోతగిన సన్నివేశమేలేదని అతనికి మరొక్కసారి ధృవపడింది.

మాలిక్ దినార్ కేవలము రొట్టెలు మాత్రమే తింటూ వుండటము చూచి, ఎందరో భక్తులు పండిన ఖర్జూరాలు, రుచికరమైన మాంసాహారాలు తెచ్చి ఆయనకు సమర్పించేవారు. ఆయన తినకుంటే, "స్వామీ! మా తృప్తికోసమైనా ఆరగించండి!" అనేవారు.

"మీ తృప్తికోసం తినేదా? భగవంతుని తృప్తికోసం మానేదా? మీవలన నేను నా నియమాన్ని ఉల్లంఘిస్తే మిమ్ములను భగవంతుడు మెచ్చుతాడా?" అనేవారు మాలిక్.

"స్వామీ!, 40 రోజులు వరుసగా మాంసాహారము తినకుంటే బలహీనత వల్ల బుద్ధిశక్తి క్షీణిస్తుంది. అప్పుడు మీ ధ్యానము పటిష్టంగా జరుగదు. కనుక దయచేసి ఆరగించండి" అనేవాడొక్కక్క భక్తుడు.

నేనిప్పటికి 40 సంవత్సరాలనుండి మాంసాహారం తినడం లేదు. నా బుద్ధి మందగించిందంటారా? అలా జరిగిననాడు అలానే తింటానేమో? అదే దానికి గుర్తు" అనేవారు మాలిక్.

అయితే ఒకసారి ఖర్జూరపు పండ్లు తినాలన్న కోరిక రోజు రోజుకూ నిగ్రహించలేనంతగా ఆయనలో పెరిగిపోయింది. చివరకు ఆయన పండ్లు

బిగించి, మనస్సును వుద్దేశించి, "నేను తిననంటే తినను; నన్ను చంపనైనా చంపు లేక నీవైనా చావు!" అన్నారు.

నాటిరాత్రి ఆయనకొక దివ్యవాణి, "నీవు తప్పక కొన్ని ఖర్జూరాలైనా తిని, ఆ బంధంనుండి నీ మనస్సును విడిపించుకో!" అని ఉద్బోధించింది. అది వింటూనే ఆయన హృదయంలోని సుఖప్రీతి ఖర్జూరాలకోసం మరింతగా గగ్గోలు పెట్టనారంభించింది.

"ఓ మనసా, నీకు ఖర్జూరాలు కావాలంటే ఒకవారం కటిక ఉపవాసం చేసి రాత్రంతా ప్రార్థనలో గడుపు. అలాచేస్తే నీకు ఖర్జూరాలు పెడతాను" అనుకున్నారు. అంతటితో సుఖాపేక్ష కొంత సర్దుకొన్నది. ఒకవారమంతా పగలంతా ఉపవసిస్తూ, రాత్రులంతా ప్రార్థనలో గడిపాడు. తరువాత ఖర్జూరాలు కొనుక్కొని, వాటిని తినటానికి మసీదును సమీపిస్తున్నారు. ఆ ప్రక్క యింటిపైనుండి ఒక పిల్లవాడిలా కేకపెట్టాడు: 'నాన్నా, ఒక యూదు ఖర్జూరాలు కొనుక్కొని తినటానికి వస్తున్నాడు".

"యూదుకు మసీదులో ఏమి పని?" అంటూ ఆ గృహస్థు బయటకువచ్చి మాలిక్‌దినార్‌ను చూస్తూనే ఆయన పాదాల మీద పడ్డాడు.

"ఏమిటి మీ పిల్లవాడు అలా కేకవేశాడు?" అడిగాడా మహనీయుడు.

"క్షమించండి! వాడికేమీ తెలియదు. మా పరిసరంలో ఎక్కువమంది యూదులే నివసిస్తున్నారు. మన ధర్మాన్ననుసరించి పగలంతా మేముపవసిస్తున్నప్పుడు గూడా యూదులు యథేచ్ఛగా భుజించడం చూస్తూ వుండడంవలన పగలు భుజించేవారంతా యూదులేనని వాడనుకొన్నాడు".

ఆ మాట వింటూనే ఆయన హృదయం దహించుకుపోయింది. అల్లాయే అతడిచేత అలా మాట్లాడించారని తలచి, "ఓ పరమాత్మా! నేను ఖర్జూరాలు తినబోతేనే ఆ పిల్లవాడి నోటివెంట నేను యూదునన్నావు. అది తింటే ఇక నన్ను మహా పాపివనవూ?" అన్నాడు.

జీవితంలో పరమార్థం తప్ప కోరదగినది ఏదీ లేదని మాలిక్ దినార్‌కి మరొక్కసారి బోధపడింది.

---

# ఏది నిజం?

ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ఈ గ్రంథం గురించి:-

"సత్యాన్వేషణ ప్రతి ఒక్కరి సొత్తుకావాలి" అంటూ ప్రారంభమయ్యే యీ అద్భుత గ్రంథం యువతకు స్ఫూర్తినిస్తుంది. అందరికీ అర్థమయ్యే సరళ పరిభాషలో ఆధునిక శాస్త్ర దృష్టిని, సనాతన ఆధ్యాత్మిక వైభవాన్నీ చదువరుడి ముందుంచి "ఏది నిజం?" అని ప్రశ్నిస్తుంది. దైవం యొక్క ఉనికిని సరియైన యోచనతో నిరూపించి, ఆధునిక శాస్త్రం ఆధ్యాత్మిక వాదాన్ని ఎలా బలపరుస్తుందో నిరూపిస్తుంది. మూఢనమ్మకాలకు తావులేని సిసలైన ఆధ్యాత్మికతకు పరాకాష్ఠగా నిలుస్తుంది. "దైవం ఉన్నాడా లేడా?" అనే ప్రశ్నకు సమాధానంకోసం ప్రతి ఒక్కరినీ అన్వేషణకు పురికొల్పే యీ గ్రంథం యీనాటి ప్రతి యువకునికి పఠనీయం. మూఢ నమ్మకాలకు బలికాకుండా అసలైన ఆధ్యాత్మికత సమాజంలో పునరుద్భవించాలంటే యీ గ్రంథం తప్పని సరి.

ఈ గ్రంథం సరళి సులువు-యోచనా వైఖరి అప్రతిహతం-బోధ అపూర్వం-విలువ అనంతం. ఇటు నాస్తికునికి, అటు అన్వేషకునికి; ఇటు సామాన్యునికి, అటు భక్తునికీ యీ గ్రంథం అర్థమవటం, అత్యవసరం!!!

-"శ్రీ గురుపాదుకా పబ్లికేషన్స్"

(శ్రీ పాకలపాటి గురువుగారి ఆరాధన సందర్భంగా) **అడవితల్లి చల్లని ఒడిలో ఆధ్యాత్మిక సౌరభం**

**శ్రీ బాబుగారితో (పాకలపాటి గురువుగారు)**

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మహరాజ్ అద్భుత సంభాషణ.**

తిరిగి నేను (ఎక్కిరాల భరద్వాజ) బాబుగారిని ప్రశ్నలడిగాను, "బాబుగారూ! సిద్ధుడు, జ్ఞాని, భక్తుడు అంటూ అనేక రకాలుగా మహాత్ములు గురించి చెబుతుంటారు. ఆ ముగ్గురికీ భేదం ఏమిటి?"

"వాస్తవానికి వారి అనుభవంలోనూ, స్థితిలోనూ ఏమి తేడా వుండదు. కాని బయటకి వారి కార్యకలాపంలో తేడా మనకు గోచరిస్తుంది, స్థూలంగా వారి ముగ్గుర్ని గురించి ఇలా చెప్పొచ్చు:

జ్ఞాని డబ్బు తయారు చేస్తాడు-'మింట్'అనవచ్చు. సిద్ధుడు దానిని లోకహితం కోసం వివిధ కార్యాలకు వినియోగిస్తాడు. వినియోగించగా వచ్చిన ఫలితమైన దైవశక్తినంతటినీ రెవెన్యూలాగా, పన్నులాగా, భక్తుడు కూడపెడతాడు."

"అసలు ముక్తుడంటే ఎవరు?"

"ప్రాణి, పదార్థము, పరిస్థితులచేత కట్టుబడనివాడు".

"అంటే?"

"ప్రాణి అంటే శత్రు మిత్రాదులవంటి ఇతర మానవుల ప్రభావం వలనగాని, క్రూర విష జంతువులవల్లగాని భయముచెందక, తను తలచిన పనిని చేసి తీరుతాడు. పదార్థం అంటే తిండి, నీరు, అగ్ని, విషం, ధనం, మొదలైన సర్వ పదార్థాలవల్ల తన సంకల్పాన్ని నిర్వహించడంలో ఏ ఆటంకానికీ లొంగనివాడు. పరిస్థితి అంటే కష్టసుఖాలు, ప్రమాదము, భయము, అస్వస్థత, ఇతరుల ప్రతికూలానుకూలాలు, వర్షాదులు మొదలైన ఏ పరిస్థితులకూ లొంగనివాడు.

అంటే పూర్తి స్వతంత్రుడే ముక్తుడు. ఏ పరిస్థితివల్ల ఏ చింతా పొందనివాడు."

"ఆధ్యాత్మ పరిపూర్ణత సాధనవల్ల వస్తుందా, లేక దైవకృపా?"

"ఆ రెండిటికీ తేడా వున్నట్లు తోచడమేగాని, అసలెక్కడిది? అయినా మనకు కనిపించేదాన్ని బట్టి చెప్పాలంటే కృషి లేక సాధన ప్రధానం. అయినా చాలా అరుదుగా ఏ కృషీలేకనే అకస్మాత్తుగా దానంతటదే జ్ఞానోదయం అవ్వచ్చు."

"జిల్లేళ్ళమూడి అమ్మ చెప్పారు-ఆమె ఎప్పుడూ ఏ సాధనా చేయలేదని ....."

"కొంతమందికి జన్మాంతర సంస్కారంగా ఆంతర్యంలో వారి ప్రయత్నం లేకనే సాధన జరుగుతుండవచ్చు. అది ఫలించాక ప్రపంచాని కవుపించవచ్చు...."

"అయితే బాబుగారు! ప్రయత్నం వల్ల సాధించినవారికీ, దైవకృపవల్ల దానంతటది లభించిన వారికీ గల స్థాయిలో తేడా ఉంటుందా?"

"స్థాయిలో-అంటే అనుభవంలో-ఏమి తేడా వుండదు. అయితే వారి అనుభవాన్ని గురించి చెప్పగలగడంలో మార్పుంటుంది. ఇప్పుడు ప్రయత్నంతో సాధించినవారునాన్నరనుకోండి. వారికి సాధనలో మనిషికుండే సాధక బాధకాలు, సందేహాలు, సమస్యలూ అన్నీ తెలుస్తాయి. కనుక వారినేమైన అడిగితే ఆ కష్టాన్ని అనుభవించి చూచినవారు గనుక వారు మన సందేహం తీరేలాగా చెప్పగలరు. కేవలం దైవకృప వల్ల జ్ఞానాన్ని పొందిన వారికి సాధకులకుండే సాధక బాధకాలు తెలియవు. అందుకని సరిగా చెప్పగలగడం కూడా వుండకపోవచ్చు."

'అంటే వారు ఏ విషయాన్ని గురించియైనా సంతృప్తిగా సమాధానం చెప్పలేకపోవడం వల్ల వారి అపరిపూర్ణత వ్యక్తం కాదా?'

"కాదు కాదు, వారి జ్ఞానం పరిపూర్ణం కాకపోవచ్చు."

"సిద్ధుడికీ, జ్ఞానికీ, భక్తుడికీ అమ్మ చెప్పిన తేడా నాకు తృప్తిగా లేదు.."

"అయ్యో, అంతమాత్రంచేత వారికి తెలియదని అనడానికి లేదు. మీకెలా చెబితే మీ సంశయం తీరుతుందో తెలియకపోవచ్చు. అంతమాత్రాన వాళ్ళ జ్ఞానాన్ని శంకించలేం!"

"బాబు! మీకు చిన్న తనం నుంచీ భయమంటే ఏమిటో

తెలియదన్నారుగదా. మరి మాకు భయం ఎందుకు కలుగుతుంది?"

"అన్యం అనిపించడంచేత" అంటూ కొంతసేపు నవ్వుతూ నా కళ్ళలోకి చూచారు. తర్వాత తమ దృష్టిని దూరాన కనిపిస్తున్న పర్వతాలమీదకో, క్రిందగా కన్పిస్తున్న చేలమీదకో లేక ఆ రెంటినీ కలిపే ఆకాశం మీదకో గాని తమ దృష్టిని మరల్చి అలా చూస్తుండి పోయారు. సన్నగా వీస్తున్న గాలి వారి జుత్తును, వాకిలికున్న తోరణాన్ని చిన్నగా కదిలిస్తున్నా, అదేమీ ఎరుగని నిర్నిమేషస్థితిలో ఒక చిత్రమైన పారవశ్యంలో కొంచెంగా ముందుకూ వెనుకకూ ఊగుతుండి పోయారు.

"అవును. మన జీవితమంతా "నేను-అన్యము" అన్న అతి సూక్ష్మమైన భావంపై కూర్చబడిన అనుభవాలమాలేకదా! అన్యత్వ ముండడంచేత మనం అన్యాన్ని చూచి భయపడతాము. రాత్రి, చీకటి, పర్వతాలు, అరణ్యాలు, క్రూరమృగాలు, సాటి మనుష్యులు-అన్నింటిని చూచి మనం భయపడతాము. నలుగురితో కలుపుగోలుగా వుండడంలో కూడా ఒంటరితనముచే భయం గనుక! నలుగురూ అండనుంటే మనకొక బలమనీ, ఎట్టి ప్రమాదమూ సులభంగా రాదన్న భావంతోనేగదా! మన కన్యంగా ఒక జగత్తు, కొందరు వ్యక్తులు, జీవులు, వస్తువులు అనుభవమవడం వల్లనే భయం కల్గుతుంది. దు:ఖము, అసూయ, ద్వేషము, స్వార్ధము- అన్నీ అందుకే కల్గుతాయి. గనుక ఒకరికొకరు అపకారం చేసుకుంటాము. అలా మనకు ఎవ్వరైనా చెస్తారేమోనన్న భయం ప్రతి పరిచయం వెనుకా దాగివుంటుంది. అలాగాక సర్వగతము, అద్వయము అయిన ఆత్మే తానని తెలిసిన జ్ఞానికి అందుకే అట్టి భయముండదు కాబోలు!" అనుకొన్నాను. అందుకు ప్రత్యక్ష సాక్ష్యం బాబుగారే! చుట్టూవుండే ప్రకృతితో ఐక్యతను పారవశ్యంతో అనుభవిస్తున్నారు. గనుకనే ఈ మహారణ్యములో ఆయనకు ఒంటరితనము, భయము అన్పించలేదు. తల్లి ఒడిలో అన్యత్వ స్ఫురణ మేల్కొనని పసిబిడ్డ, ఆ ఒడిలోని హాయిలో తాదాత్మ్యాన్ని చెంది తన్మయుడైనట్లు ఆయన కన్పిస్తున్నారు.

ఈ భావపరంపర పూర్తి అయిందో లేదో, వెంటనే బాబుగారు నాకేసి నవ్వుతూ చూచి, "అర్ధమైందా బాబు?" అన్నారు. తలూపాను. అన్నింటితో పాటు నాతో గూడా తాదాత్మ్యంగల వారికి నా భావ పరంపర గూడా తన భావపరంపరలాగే ప్రత్యక్షం. కనుకనే మౌనం రూపంలో, ఈ భావ పరంపరల రూపంలో వారే నాతో మాట్లాడారు, తెలియబరచారు.

మరలా మౌనం. ఆ మౌనమే తాదాత్మ్యం. ఆ తాదాత్మ్యమే అసలైన బోధ. ఆ బోధే ఆయన. దానికి ఆ పర్వతాలు, అరణ్యాలు, వాకిట్లో మొక్కలు సాక్షి. ఆకాశము, వాయువు-అన్నీ సాక్షి. సాక్షే అవన్నీ. ఆయనే ఆ సాక్షి. ఆ మౌనంలో ఎన్ని యుగాలు, క్షణాలు గడిచాయో!! ఆయనెవరో! ఎక్కడ జన్మించారో, తిరిగారో, ఎందుకక్కడకొచ్చారో! నేనెవరో, ఎక్కడ జన్మించితిరిగానో, నాకు వారిని గురించి చెప్పినవారెవరో, ఎందుకు వారిని దర్శించాలన్పించిందో! మా రూపాలక్కడకు రాకముందు నుండే ప్రకృతి ఎలావుందో, వచ్చాక, వెళ్ళిపోయాక అలానే ఉండబోతుంది. దానిలో మార్పులూ అలానే జరుగుతాయి. ఇన్ని రూపాలలో గోచరించే ఈ ప్రకృతికి కాలమేమిటి? రావడం, ఉండడం, పోవడం, ఏమిటి? వాస్తవానికి అంతా అయినది ఎప్పుడూ అలానే వున్నది, అదే ఇంతటికి "సాక్షి" అనుకొంటుండగా.....

"అంతేబాబు. ఇంకేమీ చెప్పవలసింది లేదు, లేద్దామా?" అన్నారు. లేచాము!!

---

శ్రీ పాకలపాటి గురువుగారు చింతపల్లి అడవులలో కొండ జాతివారికి కొలుచు దైవంగా నిలచిన సిద్ధపురుషులు. వీరి దివ్య చరిత్రను, ఆచార్యుల వారితో సంభాషణలను, మరికొన్ని అద్భుత లీలా విశేషాలను పూజ్య మాస్టరుగారు రచించిన

"శ్రీ పాకలపాటి గురువుగారి చరిత్ర"లో

చదివి అసలైన ఆధ్యాత్మికతను, దాని విలువను పాఠకులు తెలిసికొనగలరు

ప్రాప్తిస్థానము

శ్రీ గురుపాదుకా పబ్లికేషన్స్

M.M.Donka,Ongole-523002

Ph: 08592-233271

## Statement about ownership and other particulars of SAI BABA (Monthly) FORM - IV (See Rules 8)

| | | |
|---|---|---|
| 1. Name of the Publication | : | SAIBABA |
| 2. Periodicity of its publication | : | MONTHLY |
| 3. Printer's Name | : | P.Srinivasa Rao |
| Nationality | : | Indian |
| Address | : | Master Universal Sai Trust, M.M.Donka, Ongole-2 |
| 4. Publisher's Name | : | P.Srinivasa Rao |
| Nationality | : | Indian |
| Address | : | Master Universal Sai Trust, M.M.Donka, Ongole-2 |
| 5. Editor's Name | : | P.Srinivasa Rao |
| Nationality | : | Indian |
| Address | : | Master Universal Sai Trust, M.M.Donka, Ongole-2 |
| 6. Name and Address of individuals who own the News papers and Shareholders holding more than 1% of the total capital | : | Advisory Member of Master Universal Sai Trust (Regd.), Ongole-2 |

I, P.Srinivasa Rao, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Ongole (Sd.)P.Srinivasa Rao

2-1-2010

## సైన్సు చెప్పే వేదాంతం!

"బ్రహ్మ"యనే పదం 'బృంహణము' అనే ధాతువు నుండి పుట్టినది. బృంహణమంటే అంతటా అన్నింటియందూ నిండియున్నదని అర్థం. ఆ బ్రహ్మం సత్యం అన్నారు. సత్యం అంటే వాస్తవికమైన ఉనికి కలిగియుండుట. అంటే ఎన్నటికీ నశించనిది, శాశ్వతమైనదీ అని అర్థం. అదిలేని తావే లేదుకనుక అనంతమైనదన్నమాట. బ్రహ్మం సర్వానికీ ఆధారభూతుడన్నమాట - కుండలన్నింటికీ మట్టి ఆధారమైనట్లు. అదే పరమాత్మ అన్నారు. అదే సర్వవ్యాపకమనీ చెబుతారు ఋషులు, దానినే దైవమంటారు. ఈ గుణాలుగలది సృష్టికాధారంగా ఉన్నదని నిరూపిస్తే భగవంతుడున్నాడని నిరూపమైనట్లే!

ఆధునిక విజ్ఞానమేం చెబుతోంది? సృష్టిలోని పదార్థమంతా పరమాణు మయమని, ఆ పరమాణువులన్నీ ఒకే ఒక్క శక్తి లేక Energy యొక్క రూపమనే చెబుతుంది. ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త హైసెన్‌బెర్గ్ (Werner Heisenberg; 'Physics and philosophy') అనే గ్రంథంలో నేటి విజ్ఞాన సారాన్నిలా చెప్పారు: "ప్రాథమికమైన కణాలన్నింటినీ చాలినంత శక్తి ప్రభావానికి గురిచేసినట్లయితే యితర ప్రాథమిక కణాలుగా మార్చవచ్చు. లేక గతికశక్తి (Kinetic Energy) నుండి అటువంటి కణాలను సృష్టించవచ్చు. లేక ఆ ప్రాథమిక కణాలను నశింపచేసి శక్తిగా మార్చవచ్చు. కనుక మనకిక్కడ నిశ్చయమైన ఋజువు దొరికింది. పదార్థమంతటికీ ఆధారంగా ఒక ఏకత్వమున్నదని. ప్రాథమిక కణాలన్నీ శక్తి అనబడు ఒక్క ఆధారాన్ని కల్గియున్నాయి. అన్ని ప్రాథమిక కణాల రూపంలోనూ మనకదే గోచరించేది". ఇప్పుడాలోచిస్తే-బ్రహ్మమని మన ఋషులు చెప్పినది దీన్ని గురించేనని తెలుతుంది. బ్రహ్మసత్యం అన్న ఋషి వాక్యాన్ని ఆధునిక విజ్ఞానమూ నిరూపిస్తుంది!

# ప్రక్షిప్తాలు–ప్రభావాలు

-ద్వారకానాధ్

ఎందరో మహాత్ముల గూర్చి, శాస్త్రజ్ఞులగూర్చి, వారి బోధలగురించి ఎంతో విస్తారంగా పరిశోధనలు జరుగుతున్నాయి. ఎందరో మేధావులు వారి చరిత్రలను తత్వశాస్త్రం, సామాజిక శాస్త్రం, చరిత్ర, రాజకీయ, మానసిక రంగాల దృష్ట్యా పరిశోధనలు జరుపుతూ అట్టి పుస్తకాలు, T.V ప్రోగ్రామ్‌ల రూపంలో జనబాహుళ్యానికి అందజేయడం జరుగుతున్నది. అటువంటి పరిశోధనలు పరిశీలిస్తే కొన్ని ముఖ్యమైన విషయాలు అర్థమవుతాయి.

సోక్రటీస్, పైథాగరస్, ప్లేటో వంటి గ్రీకు తత్వవేత్తల నుండి మహమ్మద్‌ప్రవక్త, ఏసుప్రభువులు, యోగి వేమనల దాకా ఎందరో చరిత్రల, బోధల గురించి యూనివర్సిటీ స్థాయిలో పరిశోధనలు జరుగుతున్నాయి. వారిగురించి రాయబడిన ప్రతిమాట ఎంతో లోతుగా పరిశీలింపబడుతున్నది. పరిశోధకులలో ఎక్కువశాతం మూఢనమ్మకాలుండటం వలన, వారి మూఢనమ్మకాలకే బలం లభించేటట్లుగా అట్టి రచనలలోని లోపాలను ఆధారంగా, ప్రక్షిప్తాలను ఆధారంగా వాదించటం కనిపిస్తోంది. అంతటి మహనీయుల గూర్చిన కూలంకషమైన పరిశోధన ఎంత మంచిదైనా సరే, పరిశోధించేవారి అభిప్రాయాల వలయంలో అట్టి విశేషాలు యిరుక్కోవటం బాధాకరం. ఏసుప్రభువులు లేనేలేడని అంటూ కొందరు బొబ్బలు పెడుతుంటే రామకృష్ణ పరమహంసకు ఉన్మాదమని కొందరు వాదించి, పరిశోధనలను (వారు వంకరగా చేసినవి) ఆధారంగా చూపి ప్రచారం చేస్తున్నారు. నాస్తికులైన పరిశోధకులు సత్యాన్ని కాక తప్పులు పట్టే ధోరణులతో బొరియలు వెతుకుతున్నారు. ఆ మహాత్ముల గురించిన విశేషాలలో చరిత్రలలో ఉన్న లోపాలను, ప్రక్షిప్తాలను ఆధారంగా చేసుకుని ఆధ్యాత్మిక వాదానికే తీరని లోటు తెస్తున్నారు.

ఇదంతా జరగటంలో వారికి ఎంత పాత్ర ఉన్నదో అట్టి ప్రక్షిప్తాలను, ఊహాగానాలను మహనీయుల చరిత్రలలో కెక్కించిన వారికి అంతకు వందరెట్లు బాధ్యత ఉన్నది.

దీనికి తోడు అట్టి మహనీయుల అనుయాయుల ప్రవర్తనలు, వారి జీవితాలను సైతం పరిశోధనలు చేసి, అనుయాయుల తప్పులను మహనీయుల తప్పులలా చిత్రీకరించటం జరుగుతున్నది. దానితో ఎంతో గొప్ప ఆధ్యాత్మిక బోధ సామాన్యులకు చులకన అవుతున్నది.

నోటిమాటలు గాలిలో కలిసిపోవొచ్చు. కానీ గ్రంథాలు అలా కాదు. అవి చాలా రోజులు నిలబడిపోతాయి. కాబట్టి మహాత్ముల గురించి గ్రంథాలు రాసేవారు ఎంతో జాగ్రత్త వహించవలసి వున్నది. అటు జనబాహుళ్యం, ఇటు పరిశోధనలు అట్టి రచనల వలన ప్రభావితం చేయబడతాయి. ప్రక్షిప్తాల వలన ప్రజల భక్తిని ప్రక్కదారి పట్టించే ప్రమాదమున్నది. పరిశోధకులకు లేనిపోని అబద్ధాలనందించి సరైన అవగాహన కలగకుండా చేస్తాయి. గ్రంథ రచన కర్తలు అందుకని మిక్కిలి జాగ్రత్త వహించవలసి ఉన్నది.

మానవజాతి చరిత్రలోనే ఒక విచిత్రం కనబడుతుంది. "ఎందరో మహానుభావులు" అన్నట్లు మానవ చరిత్రలో ఎందరో అద్భుతులైన మహనీయులు ఉదయించారు. ఎంతో చక్కని జీవన విధానాలను కనబరిచారు. అద్వితీయ బోధలను

ప్రసాదించారు. కానీ వారి అనుయాయులలో ఎక్కువ భాగం, ఎంతో భక్తి ఉన్నవారైనా సరే, అట్టి మహనీయుల బోధలు అందుకోలేక, అలా అని వదలలేక, వారి జీవితాన్ని, బోధను సరిగా అర్థం చేసుకోలేక పోవటం, సామాన్యంగా ఎవరికి తోచిన రీతిన వారు ఆ మహనీయుడు చెప్పినదానికి విపర్యంగా, వ్యతిరేకంగా ప్రవర్తించటం చరిత్ర విదితం.

ఉదాహరణకు బుద్ధభగవానుని తీసుకోండి. అనవసరమైన ఆచారకాండ కంటే ధర్మపరమైన ఆచరణ ప్రథమమని, ఆధ్యాత్మిక లక్ష్యాన్ని అందుకోటానికి చేసే సాధన విషయంలో బాహ్యం కంటే ఆంతరంగమే ప్రధానమని వారు బోధించి ఆచరించి చూపారు. కులమతాల పేరిట వర్గీకరణను, మూఢాచారాలలో భ్రష్టమైన ఆధ్యాత్మికతను క్షాళణ చేసి అసలైన ఆధ్యాత్మిక బోధ ప్రసాదించారు. అందులో విగ్రహారాధన కంటే సత్యశోధనకు, మనోవికాసానికి ప్రాధాన్యమెక్కువ. కానీ వారు సమాధి చెందటంతోటే వారి శిష్యగణంలో ఎన్నో వర్గాలు ఏర్పడటం, బుద్ధుడు చెప్పిన ఆంతరంగిక సాధన కంటే విగ్రహారాధన ప్రాధాన్యమై చివరకు బుద్ధుడి విగ్రహమే పెట్టి చేసే పూజలకు, మందిరాల సంఖ్యకు ప్రాధాన్యత పెరిగిపోవటం చరిత్ర చూస్తే తెలుస్తుంది. యుద్ధాలకు సైతం దారి తీయటం చిత్రం.

అలానే శ్రీ జిడ్డు కృష్ణమూర్తిగారి బోధలు వ్యక్తి ప్రాధాన్యతలేని ఆధ్యాత్మికతను (అసలైన వేదాంతివలె) ప్రబోధించి, మూఢనమ్మకాలను, దొంగ గురువులను నిరసించి, సిసలైన ఆధ్యాత్మికతకు లోచూపు, పరిశీలన, ఆత్మవిమర్శలను ప్రధానంగా ఉద్బోధించటం కనబడుతుంది. అందులో ఎవరిసాధన వారిది. దానికి ఒక సంస్థతోనో, ధనార్జనతోనో, ఎంతమంది ఆ మార్గాన్ని అవలంబిస్తున్నారోననే లావాదేవీలతోనూ సంబంధంలేదు. కానీ వారు సశరీరులుగా జీవించి ఉండగానే ఆయన బోధనల గురించి కోర్టుకేసులు నడవడం, సంస్థలు, మార్గాలు ఏర్పడడం చిత్రం. సత్సంగాలు, study centreలు ఏర్పడి ఆయననే ఒక “గురువు”గా వ్యక్తి ప్రాధాన్యాన్ని ఆపాదించటం చూడవచ్చు.

అట్టివారు చెప్పిన మార్గాన్ని తు.చ. తప్పక పాటించే వారెంతమంది? అసలది సరైన రీతిన అర్థమైనవారెంతమంది? అక్కడకొచ్చేసరికి అట్టి మహనీయుల బోధలకు ఎవరి వ్యాఖ్యానం వారిది అన్నట్లుంటుంది. ఆ మహనీయులల వ్యాఖ్యానం ఏమయ్యుంటుందో అర్థంగాని రీతిన వారి జీవితాలు, బోధలు కత్తిరింపులతో కల్పితాలతో కలుషితం కావడం విచారకరం. అనుసరణకు మించిన అనుకరణ, అవగాహనకు మించిన ఆతురత అట్టి మహనీయుల గూర్చి ఇంకా ఇంకా గొప్పగా చెప్పాలనే తపనలో లేనివి ఉన్నట్లుగా, తనకర్థమైన అల్పత్వమే వారి అద్వితీయ బోధగా జరిగిన, జరుగుతున్న చిత్రీకరణ ప్రధాన కారణాలు.

పూజ్యశ్రీ ఆచార్యుల సన్నిధిని అనుభవించిన అదృష్టవంతులెందరో ఉన్నారు. వారు గురుదేవుల బోధలను, జీవిత విశేషాలనూ నలుగురికీ తెలియజేస్తున్నారు. గ్రంథాలు రాస్తున్నారు. ప్రవచనం చేస్తున్నారు. ఎందరికో ఆయనగురించి తెలిపి అసమానమైన సేవ చేస్తున్నారు.

అయితే చరిత్రనుంచి అట్టివారందరము నేర్వవలసిన

పొరపాట్లెన్నో ఉన్నాయి. ముఖ్యంగా గ్రంథాలు రాసేవారు చాలా జాగ్రత్తలు వహించాల్సి ఉన్నది. అవి చదివిన వారు ప్రక్కదారి పట్టే ప్రమాదం ఉంది. దానికి బాధ్యత, కర్మ రచయితదవుతుంది. ప్రక్కదారి పట్టించే రీతిన వారిగూర్చి చిత్రీకరణ జరిగితే ఎంతో ప్రమాదం. ఆచార్యులు అద్వితీయులు. వారి గూర్చి భవిష్యత్-తరాలవారు ఏమి అనుకుంటారో, ఎలా అర్థంచేసుకుంటారన్నది ఎంతో ముఖ్యమైన విషయం. ఆయన గురించి వచ్చే ప్రతి గ్రంథము, ఇప్పుడు కాకున్నా-భవిష్యత్తులోనైనా, ఎంతో ప్రామాణికంగా పరిగణించబడుతుంది. అట్టి గ్రంథాలలో ఉండే విషయాలు ఎంతో శ్రద్ధతో పఠించబడతాయి. మానవజాతి ఆధ్యాత్మిక భవిష్యత్తుకు వార్తాహరుడు ఆయన. ఆయన గూర్చి సరి అయిన విషయాలు మాత్రమే, సరియైన విధంగా మాత్రమే ప్రచారంకావటం ఎంతో అవసరం.

అనంత విశ్వంలో ధూళికణంతో సమానమైన మన శరీరము, జీవన కాలము ఎంత అల్పములో గుర్తించి వ్యక్తిగత అభిప్రాయాలకంటే ఎంతో పెద్దది, ముఖ్యమైనది ఆయన ఆధ్యాత్మిక ప్రవంతిని దృష్టిలో ఉంచుకుని మానవ చరిత్రలో గురుదేవుల పేరు ఎలా నిలబడుతుందో నన్నది అట్టి గ్రంథకర్తలపై ఆధారపడుతుందని గుర్తుంచుకుని, ప్రలోభాలకు, స్వలాభాలకు, పారవశ్యానికీ లొంగక ఎంతో జాగ్రత్తతో సరైన ప్రచారం జరగాల్సి వుంది. అందుకని ఆ విషయంలో ఎంత జాగ్రత్తపడ్డా ఎక్కువ కాదు. ఈ విషయం అటు గ్రంథకర్తలు, ఇటు భక్తులు గుర్తుంచుకుని వివేకంలో పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందరి మహనీయుల గురించి ఏదైతే జరిగిందో అదే శ్రీ ఆచార్యుల గురించి జరుగుతున్నది. ఇది జాగ్రత్తగా ఆలోచించి, చర్చించి, తెలుసుకొని అంతటి మహనీయమూర్తి చరిత్రను, బోధలను ప్రక్షిప్తాలతోనూ, అరకొర రచయితల పిచ్చిరాతలతోను కలుషితం కాకుండా కాపాడుకోవలసిన బాధ్యత మనపైవున్నది. ఇంతటి మహనీయుని అద్వితీయ బోధలు మానవ మూర్ఖత్వానికి బలియై కలుషితం కావడం ఎంతో దురదృష్టకరం. స్వార్థ అసూయాది భావాలు, గొప్పతనం తమకే ఆపాదించుకోవాలనే కాంక్షనం ఈ రోజున అట్టి పరిస్థితులను కల్పిస్తున్నాయి.

దీనికి ఒక్కటే మందు. కలుషితమైన చరిత్రలు, బోధలు ప్రజాబాహుళ్యానికి చేరక మునుపే సరైన విషయం జనులకు తెలియాలి. ఇందుకు మనలో ప్రతి ఒక్కరికీ వారి బోధలు గూర్చిన స్వాధ్యాయ-ప్రవచనాలు ఎంతో ప్రధానం.

అంతటి దివ్య సమన్వయాత్మకమైన బోధలు కలుషితం కాకుండా, భవిష్యత్ ప్రజలు వారి బోధలను సరిగ్గా అందుకునేలా చేయడం మన కర్తవ్యం. ఇది జ్ఞప్తియందుండి అట్టి గ్రంథాలు రాస్తున్న రచయితలు జాగ్రత్త వహించడం ఎంతో ముఖ్యం.

అట్టి దివ్యబోధలు ఆచంద్రతారార్కం నిష్కల్మషంగా నిలచి ఉండేలా అనుగ్రహించమని గురుదేవులకు ప్రార్థన.

ఓం శాంతి: శాంతి: శాంతి:

లోకాస్సమస్తా: సుఖినో భవంతు

జై సాయి మాస్టర్!!!

# అనుమానాలకు తావిచ్చే ఆచార్యుని ఆదేశం!

సుషుమ్న

ఒక ముస్లిం మహాత్ముడు 60మంది శిష్యులతో ఆశ్రమంలో నివసిస్తుండేవాడు. యథాశక్తి వారందరికీ శిక్షణ నిచ్చారు. ఇక ఒక నూతన అనుభవాన్ని పొంద వలసి వున్నదని చెప్పి ఆయన వాళ్ళతో అన్నారు, "మనమొక సుదీర్ఘ యాత్రచేయాలి. ఇదమిద్ధమని నేనిప్పుడు నిశ్చయించి చెప్పలేనిదేదో దారిలో సంభవిస్తుంది. నూత్న బోధను గ్రహించగల పరిపాకాన్ని పొందినవారు మాత్రమే నాతో రాగలుగుతారు. కాని మొదట అట్టి వారు, 'మా గురువు బదులు నేనే మరణిస్తాను' అన్న వాక్యాన్ని వల్లించాలి. తరువాత అవసరమొచ్చినప్పుడు రెండుచేతులు పైకెత్తిన సమయంలో ఈ వాక్యాన్ని బిగ్గరగా చాటాలి."

ఎక్కువ మంది శిష్యులు గురువుగారి సంకల్పంలోని నిజాయితీని శంకించి తమలోతాము గుసగుసలాడటం మొదలు పెట్టారు. చివరకు, 'ముందెప్పుడో తనకొక ప్రాణాపాయం రానున్నదని తెలిసి, తన బదులు మనను బలి చేయాలని చూస్తున్నాడు!' అంటూ 59 మంది శిష్యులు ఆయనను విడిచివెళ్ళిపోయారు. 'బహుశ: హత్యవంటి దుష్కార్యాన్నేదో మీరు తలపెట్టి ఉండాలి! ఇటువంటి షరతులకు మేము సమ్మతించము' అని నిందించి మరీ పోయారు.

గురువు, ఒక్క శిష్యుడు ప్రయాణం చేస్తున్నారు. వారు ప్రవేశించడానికి కొద్ది సమయం ముందు ఒక క్రూరుడు ప్రక్క నగరానికిరాజై ప్రజలను భయం ద్వారా అదుపులో పెట్టాలని తలచి తన భటులతో, దారినిపోయే అమాయకుడినెవడినైనా న్యాయస్థానానికీడ్చుకు రండి. వాడినేదో నెపం మీద ప్రజల ఎదుట కఠినంగా శిక్షించాలి' అని ఆజ్ఞాపించాడు. ఆ భటులకు ఈ ఒక్క శిష్యుడూ దొరికాడు. వారతనిని ప్రజల ఎదుట రాజు ముందు పడవేశారు. రాజు,"నీవంటి సోమరిపోతులను సహించబోము. నీకు మరణదండన విధిస్తున్నాను" అని గర్జించాడు. వెంటనే గురువు 'మహారాజా! అతడలా అవడానికి కారణమైన నన్ను దండించండి!' అని పైన వల్లించమన్న వాక్యాన్ని అరచి తన రెండు చేతులూ పైకెత్తాడు. వెంటనే శిష్యుడు కూడ అలానే అరచాడు. రాజు ఆశ్చర్య చకితుడై దిక్కుతోచక మంత్రుల సలహాకోరాడు. వారు, 'ప్రజలలో ఈ ధోరణి ప్రబలితే మన మేం చేయగలం? ముందువారలా అనడానికి కారణం తెలుసుకోండి!' అన్నారు.

కారణమడిగిన రాజుతో గురువిలా అన్నాడు, "రాజా! ఈ రోజిక్కడ ఒక వ్యక్తి మరణించవలసి వున్నదని అతడు కొంత కాలానికి మరలా జీవించి మరణరహితుడై శాశ్వతంగా జీవిస్తాడనీ నాకొక దివ్యవాణి తెలిపింది. ఆ వ్యక్తి నేను కావాలంటే నేను కావాలని మేమిద్దరమూ పోటీపడుతున్నాము."

దుష్టుడైన ఆ రాజు అట్టి అమరత్వాన్ని తానే పొందదలచి తనకే శిరశ్ఛేదం చేయవలసిందిగా భటుల నాజ్ఞాపించారు. ఆ విధంగా రాజ్యానికంతటికీ మహావిపత్తు తొలగి పోయింది.

సద్గురుని ఆజ్ఞ శిష్యునికేకాక సర్వులకూ ఎప్పుడూ శ్రేయోదాయకమే! 'సర్వధర్మాన్ పరిత్యజ్య' అన్న వైఖరి ఒక్కటే శ్రేయోదాయకము.

ఈ గురువు తెలివిగా బొంకాడనుకొంటే పొరపాటు. గురువాజ్ఞను శిరసావహించి మరణాన్నైనా ఎదుర్కొనడానికి సిద్ధపడిన శిష్యుడు మాత్రమే శాశ్వతపదవిని పొందుతాడన్నది ఒక సాంకేతికమైన ఆధ్యాత్మిక సత్యం. జీవత్వం నశించాకనే గదా బ్రహ్మత్వం సిద్ధించేది. మరణమంటే అహంకారనాశనం.

# ద్వారకామాయి అనుభవమంటపం

S.V.Rama Prasad

ఆకలితో అలమటించే ఒక నిరుపేదకి పట్టెడన్నం లభిస్తే, అదే మహాప్రసాదంలా వుంటుంది. అట్లానే గురుదేవులు పూజ్యశ్రీ మాస్టరుగారు 27.03.2008 (గురువారం) నాకు స్వప్నదర్శనం ఇచ్చారు. "ఒక ఇంటి గుమ్మం ముందు తెల్లటి లుంగీ, గోల్డ్‌కలర్ లాల్చిలో నాకు 12 అడుగుల దూరంలో నిలబడి, నా వైపు చిరునవ్వుతో, చూస్తున్నారు. ఒక్కసారిగా, ఆ దివ్యమంగళరూపం చూసేసరికి, నా ఆనందానికి అవధులులేవు. అరే, అయ్యవారికి, ఏమీ తీసుకురాలేదు అనుకుంటూనే, వేగంగా ఆయన వైపుకి నడచి పరమపవిత్రమైన పాదాలకి సాష్టాంగ నమస్కారము చేసుకుంటూ, ఎప్పటికీ వీటినుండి దూరం చేయవద్దని ప్రార్థిస్తూ, మరొక్కసారి నా రెండు చేతులతో చాలా దగ్గరగా ఆ పవిత్ర పాదాలని పెనవేసుకుని, వాటిమీద తనివి తీరా ముద్దుల వర్షం కురిపించాను. ఆ తరువాత ఒక మంచం/బల్ల మీద మాస్టర్‌గారు కూర్చున్నారు. అదే హాల్ లో అమ్మగారు కూడా వేరొక చోట కూర్చున్నారు. నేను కూడ నేలమీద ఒక ప్రక్కన కూర్చున్నాను. ఇంతలో అమ్మగారు, బయట ఎండలో ఆరవేసిన బట్టలు, లోపలికి తెచ్చే ఉద్దేశ్యంతో పైకి లేచారు. అది గమనించిన నేను, "అమ్మగారు, అవి నేను తీసుకొస్తా" అంటూ, బయటకి వెళ్ళాను. వెంటనే మెలుకువ వచ్చింది. వరుసగా, రెండు రోజులు, నాలో నేను, తెలియని సంతోషం ఆనందంతో వున్నాను. ఈ స్వప్నం రావటానికి ముందు రోజున "మహాత్ముల ముద్దు బిడ్డడు" 196వ పేజీలో "నిద్దురలో ఉన్నా సరే మీరు నన్ను ప్రార్థిస్తే నాకు తెలుస్తుంది. కర్మ workout కావాలి అని కోరినవి అన్నీ తీర్చను, మీకు ఏది మేలో అది చేస్తాను. అడిగింది యివ్వకపోతే మీరు తిట్టుకుంటే ఎలా?" పారాయణ క్రమంలో చదవటం తటస్థించినది. పైగా, ఈ అమృత వాక్కులు made an indelible impression in my mind. అదే ఆలోచిస్తూ "నాకు మీ పాదములను దర్శించుకోవాలనివుంది. మీరు ఇచ్చినమాట, నిరూపించి, నా భక్తి విశ్వాసములు ఎప్పటికీ వుండేలా చేయ"మని ప్రార్థించి నిద్రపోయాను. ఈ స్వప్న అనుభవం, నా జీవితంలో చాల ముఖ్యమైన సుదినం మరియు ఎన్నటికీ మరువలేనిది. ఈ అమృత అనుభవమిచ్చిన పూజ్య మాస్టరుగార్కి శతకోటి ప్రణామములు అర్పించుకుంటూ, ఎల్లప్పుడు, మరిఎప్పటికీ, శ్రీ అలివేలుమంగభరద్వాజుల దివ్య పాదచరణములే నా హృదయమందు వుండాలనీ తపిస్తూ........ ఇందు తప్పులున్నచో క్షమించవలయును.


**పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతం-శ్రీగురు చరిత్ర | 200-00 |
| శ్రీ సాయి లీలామృతము | 70-00 |
| శ్రీ గురు చరిత్ర | 70-00 |
| శ్రీ సాయి సన్నిధి | 75-00 |
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | 75-00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము | 40-00 |
| సాయినాథ పూజ | 20-00 |
| సాయినాథ స్తవనమంజరి | 5-00 |
| శిరిడీ ఆరతులు | 6-00 |
| సాయిబాబాను సేవించడమెందుకు | 5-00 |
| సత్సంగము-భజన | 5-00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | 10-00 |
| విజ్ఞాన వీచికలు | 40-00 |
| పరిప్రశ్న | 35-00 |
| మతమెందుకు? | 20-00 |
| ఏది నిజం? | 20-00 |
| ధ్యానయోగ సర్వస్వం | 33-00 |
| బుద్ధధ్యాన హృదయం | 20-00 |

| | |
|---|---|
| దత్తావతార మహత్త్యం | 30-00 |
| సంహితాయన గురు ద్విసాహస్రి | 35-00 |
| పురుషసూక్త రహస్యం | 20-00 |
| సాయిసూక్తి-ఆచార్యవాణి | 5-00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | 30-00 |
| అవధూ త శ్రీ చీరాల స్వామి | 15-00 |
| అవధూత శ్రీ వెంకయ్యస్వామి | 40-00 |
| శ్రీ ఆనందమాయి అమ్మ | 20-00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | 40-00 |
| శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర | 25-00 |
| స్వామి సమర్థ (అక్కల్కోట స్వామి) | 30-00 |

## ఇతర ప్రచురణలు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | 55-00 |
| అవధూత చివటం అమ్మ | 35-00 |
| శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర | 30-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు | 75-00 |
| మరో నందదీపం | 22-00 |
| ఆచార్య అమృత లేఖావళి | 40-00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ | 125-00 |
| గురుశుశ్రూష | 199-00 |

## BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba The Master | 110-00 |
| Guru Charitra | 50-00 |
| Supreme Master (Swami Samartha) | 50-00 |
| Sai Baba and His Teachings | 60-00 |
| Life and Teachings of Hazarat Tajuddin Baba | 25-00 |

## BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sai Baba (Hindi) | 100-00 |
| Sai Leelamrutham (Kannada) | 80-00 |
| Sai Baba Jeevitha Charitham (Malayalam) | 90-00 |
| Sai Baba Leelamrutham (Tamil) | 80-00 |
| Sri Guru Charitra (Hindi) | 50-00 |
| Sri Guru Charitra (Kannada) | 99-00 |
| Shirdi Arathi (Tamil) | 6-00 |
| Stavana Manjari (Tamil) | 3-00 |